teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 316 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 3 ఏప్రిల్ 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు వాయుసేన గ్రీన్ సిగ్నల్




- విమాన సేవల ప్రారంభానికి అనుమతులు మంజూరు
- ఆరు నెలల వ్యవధిలోనే రెండు ఎయిర్ పోర్టులకు అనుమతులు
- రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి దక్కిన ఫలితం
- రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెల్లడి

## కాల్పుల విరమణకు సిద్ధం

- చర్చలకు ప్రతిపాదిస్తే, కాల్పుల విరమణను ప్రకటిస్తాం
- చర్చకు సానుకూల వాతావరణాన్ని కోరిన మావోలు
- హత్యాకాండను తక్షణమే ఆపేయాలని డిమాండ్
- చర్చలపై మావోయిస్టు ప్రతినిధి అభయ్ పేరుతో లేఖ విడుదల



తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 02 (తీన్మార్ న్యూస్): గత కొద్దిరోజులుగా కేంద్ర బలగాలు మావోయిస్టులపై ఉక్కుపాదం మోపుతున్నాయి. కూంబింగ్ పేరుతో మొత్తం ఐదు రాష్ట్రాల్లోని అభయారణ్యాల్లో జల్లెడపడుతూ వారిపై విరుచుకుపడుతోన్న విషయం తెలిసిందే. ఇప్పటికే పదుల సంఖ్యలో ఎన్‌కౌంటర్లు జరగ్గా వందల మంది మావోయిస్టులు తమ ప్రాణాలను కోల్పోయారు. ఈ క్రమంలోనే కాల్పుల

మిగతా 2 లో




## హెచ్సీయూ భూముల వివాదంలో సర్కార్‌కి షాక్

- 400 ఎకరాల భూమిలో చెట్లు కొట్టివేయరాదని హైకోర్ట్ ఉత్తర్వులు
- 24 గంటల పాటు ఎలాంటి పనులు చేపట్టరాదని ఆదేశాలు
- ప్రజా వాజ్యంపై నేటికీ విచారణ వాయిదా

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వివాదంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్ట్ షాక్ ఇచ్చింది. గురువారం వరకు హెచ్సీయూ సమీపంలోని కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమిలో చెట్లు కొట్టివేయరాదని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా చర్చ నడుస్తున్న ఈ భూమి వివాదంపై వాటా ఫౌండేషన్ హైకోర్టులో పిల్ దాఖలు చేసింది.



02

## పర్యావరణం నాశనం చేయడమే ఇందిరమ్మ రాజ్యమా..?

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు
- హెచ్‌సీయూ భూముల వేలం నిలిపివేయాలి
- ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద బీజేపీ నేతలు ధర్నా




హైదరాబాద్, ఏప్రిల్ 02 (తీన్మార్ న్యూస్): ఇందిరమ్మ ఇచ్చింది అని చెప్పి, నిరంతరం ఇందిర జపం చేస్తూ పర్యావరణ వినాశనం చెయ్యడమే ఇందిరమ్మ రాజ్యమా? అని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. హెచ్‌సీయూ భూముల వేలం నిలిపివేయాలని ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద బీజేపీ నేతలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తీసుకొస్తానని

మిగతా 2 లో

## జూన్ 1 వరకు ఇంటర్ కాలేజీలకు సమ్మర్ హాలిడేస్

- పరీక్షలు ముగియగా అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ప్రకటన
- జూన్ 2న పునఃప్రారంభం కానున్న కాలేజీలు
- ఉత్తర్వులను పాటించని యెడల కఠిన చర్యలు
- కాలేజి యాజమాన్యాలకు ఇంటర్ బోర్డ్ హెచ్చరికలు
- ఏప్రిల్ మూడవ వారంలో ఇంటర్ విద్యార్థుల ఫలితాలు



02

## 728 ఏకలవ్య స్కూల్స్ ఏర్పాటుకు కేంద్రం నిర్ణయం

3.5 లక్షల మంది షెడ్యూల్ తెగ విద్యార్థులకు ప్రయోజనం

- మంజూరు చేయబడ్డవి 721 పాఠశాలలు
- 477 పాఠశాలలు పనిచేస్తున్నట్లు వెల్లడి




న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 02 (తీన్మార్ న్యూస్): దేశ వ్యాప్తంగా దాదాపు 3.5 లక్షల మంది షెడ్యూల్ తెగ విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చే 728 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను

మిగతా 2 లో



## ఢిల్లీ గద్దె మీద ఎలా ఉంటారో మేము చూస్తాం

- మోడీ ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ
- ఢిల్లీ గడ్డపై "బీసీ రిజర్వేషన్లపై" గళం విప్పిన సీఎం రేవంత్
- బీసీ గర్జన నిప్పు రవ్వలా వ్యాపిస్తుందని వ్యాఖ్యలు

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 02 (తీన్మార్ న్యూస్): బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన గళాన్ని ఢిల్లీ గడ్డపై వినిపించారు. బీసీ గర్జన నిప్పు రవ్వల రగిలి దేశం మొత్తం వ్యాపిస్తుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. మీరు ఢిల్లీ గద్దె

మిగతా 2 లో

## సిల్వర్ జూబ్లీ వేడుకలపై బీఆర్ఎస్ పార్టీ కసరత్తు

- ఉమ్మడి జిల్లాల వారీగా కెసిఆర్ వరుస సమావేశాలు
- నియోజకవర్గాల వారీగా సమావేశాలకు దిశానిర్దేశం



02

## ఎల్ఆర్ఎస్ రాయితీ గడువును మరోసారి పొడిగింపు


- మార్చ్ 31తోనే ముగియగా పెంచుతూ ఉత్తర్వులు
- ఏప్రిల్ 30 వరకు పొడగించినట్టు ఉత్తర్వుల్లో వెల్లడి



02

## హెచ్సీయూ వివాదంపై స్పందించిన కేంద్ర పర్యావరణ శాఖ

- ఈ మేరకురాష్ట్ర అటవీ శాఖకు కేంద్ర పర్యావరణ శాఖ లేఖ
- విఘాతం కలిగించిన బాధ్యులపై చర్యలకు ఆదేశాలు
- వార్తాల నిజ నిజాలపై విచారణ చేసి నివేదికకు ఆదేశాలు




02

## ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసుపై విచారణ ప్రారంభం

- స్పీకర్ చర్య తీసుకోకపోతే కోర్టులు చూస్తూ ఉండాల్సిందేనా..?
- విచారణలో భాగంగా ప్రశ్నించిన జస్టిస్ గవాయ్



05



05

## ఆయిల్ పామ్ సాగు రైతులకు లాభసాటి

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

## ఈ నెల 11 నుంచి 14 వరకు తెలంగాణ రైతు మహోత్సవం

- వ్యవసాయ అనుబంధ రంగాల్లో రైతు సమస్యలపై ఎగ్జిబిషన్
- రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



02

# హెచ్సీయూ భూముల వివాదంలో సర్కార్‌కి షాక్




హైదరాబాద్, ఏప్రిల్ 02 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వివాదంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్ట్ షాక్ ఇచ్చింది. గురువారం వరకు హెచ్సీయూ సమీపంలోని కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమిలో చెట్లు కొట్టివేయరాదని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా చర్చ నడుస్తున్న ఈ భూమి వివాదంపై వాటా ఫౌండేషన్ హైకోర్టులో పిల్ దాఖలు చేసింది. ఈ భూమిలో ప్రభుత్వ వేలాన్ని నిలిపివేయాలని, వన్యప్రాణులకు ఆవాసమైన ఆ స్థలాన్ని జాతీయ పార్కుగా ప్రకటించాలని ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు చేసింది. ఈ పిల్ పై బుధవారం హైకోర్ట్ విచారణ చేపట్టింది. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ బుల్డోజర్లను ఉపయోగించి చెట్లను నరికివేస్తోందని పిటిషనర్ తరపున న్యాయవాది వాదించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అటవీ భూమిని కొట్టివేయాలంటే నిపుణుల కమిటీ వేయాలని అన్నారు. ప్రభుత్వం ఆ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారం చెట్లు కొట్టివేసి, ఆ స్థలంలో ఉన్న ఎన్నో వన్యప్రాణుల ప్రాణాలను రిస్క్ లో పెట్టిందన్నారు. ఇరువైపులా వాదనల అనంతరం కంచ గచ్చిబౌలిలో భూమిలో 24 గంటల పాటు ఎలాంటి పనులు చేపట్టరాదని తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేస్తూ విచారణ ఈరోజుకి వాయిదా వేసింది హైకోర్ట్.

# పర్యావరణం నాశనం చేయడమే ఇందిరమ్మ రాజ్యమా..?

మొదటి పేజీ తరువాయి

చెప్పి అధికారంలోకి వచ్చాడని, అలాగే తెలంగాణలో పర్యావరణాన్ని రక్షిస్తానని చెప్పి హైడ్రాను తీసుకొచ్చాడని అన్నారు. ఇప్పుడు కొన్ని వేల చెట్లు, వేల పశుసంపదకు నిలయంగా ఉన్న సెంట్రల్ యూనివర్సిటీలోని చెట్లను నరికివేయడాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ కళ్లు మూసుకొని ఎలా చూస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. 1973 లో ఆనాటి కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమాన్ని అణిచివేయడానికి 2400 ఎకరాల భూములతో సెంట్రల్ యూనివర్సిటీని హైదరాబాద్ కు ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి ఇందిరమ్మ రాజ్యం పేరుతో అధికారంలోకి వచ్చి అందులో 400 ఎకరాలు మా ఇష్టారాజ్యం అమ్ముకుంటామని చెబుతున్నారని, ఈ అధికారం రేవంత్ రెడ్డికి ఎవరు ఇచ్చారో చెప్పాలని నిలదీశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ భూముల అమ్మకాన్ని వ్యతిరేకించిన రేవంత్ రెడ్డికి అధికారంలోకి వచ్చాక భూముల అమ్మకం న్యాయమేనని చెప్పింది ఎవరో చెప్పాలని అన్నారు. అలాగే ఎక్కడా అప్పు పుట్టడం లేదన్న రేవంత్ రెడ్డి పైసల కోసం సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్ముతున్నాడని, ప్రభుత్వ భూములు అమ్ముకునే ఈ కార్యక్రమాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు. ఈ వ్యవహారంలో బీజేపీ పార్టీ విద్యార్థుల పక్షాన నిలబడుతుందని, రేవంత్ రెడ్డి వెంటనే ఈ కార్యక్రమాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. పర్యావరణాన్ని రక్షించడం కోసం ఎన్జీటీలో కూడా పిటిషన్లు వేస్తామని, ప్రజాప్రతినిధులంతా న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని చెప్పారు. ఆ భూములను రక్షించి, విద్యార్థులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇక విద్యార్థులకు ఏదో జరగరానిది జరిగిందని నాలుగు సార్లు సెంట్రల్ యూనివర్సిటీకి వచ్చిన రాహుల్ గాంధీకి ఈ రోజు అదే యూనివర్సిటీ కనిపించడం లేదా? విద్యార్థులపై జరిగిన లాఠీ చార్జీ కనిపించడం లేదా అని ప్రశ్నించారు. జంతర్ మంతర్ వద్ద ధర్నా అయిపోయాక రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీలు చేతనైతే సెంట్రల్ యూనివర్సిటీకి రావాలని సవాల్ విసిరారు. మంత్రులు కోర్టులలో కేసులు గెలిచామని మాట్లాడుతున్నారని, ఒక్క మంత్రైనా కోర్టు ఆర్డర్ చదివారా అని మండిపడ్డారు. ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి తెలంగాణ భూములను కాపాలని అంటే ఈనాటి తెలంగాణ ముఖ్యమంత్రి తెలంగాణ భూములను అమ్మాలని చూస్తున్నాడని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఖచ్చితంగా అడ్డుకొని, విద్యార్థులకు అండగా ఉంటామని రఘునందన్ భరోసా ఇచ్చారు.

# 728 ఏకలవ్య స్కూల్స్ ఏర్పాటుకు కేంద్రం నిర్ణయం




మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా మొత్తం 721 పాఠశాలలు మంజూరు చేయబడ్డాయి, వాటిలో 477 పాఠశాలలు పనిచేస్తున్నట్లు నివేదించబడింది. రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానంలో, గిరిజన వ్యవహారాల సహాయ మంత్రి దుర్గాదాస్ ఉయ్కే మాట్లాడుతూ గిరిజన పిల్లల కోసం వారి స్వంత వాతావరణంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల యొక్క కేంద్ర రంగ పథకం 2018-19లో ప్రారంభించబడిందని అన్నారు. ఈ పథకం కింద, 50 శాతం కంటే ఎక్కువ ఎస్టీ జనాభా మరియు కనీసం 20 వేల మంది గిరిజనులు ఉన్న ప్రతి బ్లాక్‌లో ఒక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన అన్నారు. గిరిజన విద్యార్థులకు డిజిటల్ మరియు నైపుణ్య ఆధారిత విద్యను అందించడానికి ప్రభుత్వం ఇతర ప్రభుత్వ సంస్థలతో కలిసి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి హైలైట్ చేశారు.

# ఎల్ఆర్ఎస్ రాయితీ గడువును మరోసారి పొడిగింపు

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 02 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్ఆర్ఎస్ పథకం రాయితీ గడువును మరోసారి పెంచింది. లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం రాయితీ గడువు మార్చ్ 31తోనే ముగియగా మరోసారి గడువు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ గడువును ఏప్రిల్ 30 వరకు పొడగించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా గత నాలుగేళ్లలో పెండింగులో ఉన్న ప్లాట్లకు రిజర్వేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిన సంగతి తెలిసిందే. వీరికి 25% రాయితీ కల్పిస్తూ మార్చి 31 లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని గడువు ఇవ్వగా ఆశించిన మేర రిజిస్ట్రేషన్లు మాత్రం జరగలేదు. ప్రజల నుంచి పెద్దగా స్పందన లేకపోవడంతో ప్రభుత్వం ఈ గడువును ఏప్రిల్ 30 వరకు మరోసారి పెంచుతూ బుధవారం ఆదేశాలు జారీ చేసింది.

# ఈ నెల 11 నుంచి 14 వరకు తెలంగాణ రైతు మహోత్సవం

హైదరాబాద్, ఏప్రిల్ 02 (తీన్మార్ న్యూస్): వ్యవసాయం, ఉద్యానవన, పశుసంవర్ధక, ఆక్వా, వ్యవసాయ అనుబంధ రంగాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల కోసం ఈ నెల 11 నుంచి 14 వరకు తెలంగాణ రైతు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. ఇటీవలే తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ అగ్రి కల్చర్ సొసైటీ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహిస్తుందన్నారు. అన్నదాతల సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా సృజనాత్మకతతో కూడిన ఆవిష్కరణలు యంత్రాలతో నిర్వహించబడుతుందన్నారు. పూర్తి స్థాయి వ్యవసాయ ప్రదర్శనకు రాష్ట్ర నలుమూలల నుంచి రైతులందరు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. ఇందులో అన్ని రంగాల రైతులు, వ్యవసాయం, పశుపోషణ, కోళ్ల పరిశ్రమ, మత్స్యపరిశ్రమ రంగాలకు చెందిన శాస్త్రవేత్తలు, ప్రభుత్వ అధికారులు, సంబంధిత సంస్థలు హాజరవుతాయని తెలిపారు. అదే విధంగా విత్తనాలు, ఎరువులు, మందుల కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు, స్వచ్ఛంద సహాయక సంస్థలు, విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. ఈ ఎగ్జిబిషన్‌లో సుమారుగా 400 ప్రదర్శన స్టాళ్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సమావేశంలో సభ్యులు కెవిఎన్‌రెడ్డి, భవాని రెడ్డి, గోపాల్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కాల్పుల విరమణకు సిద్ధం



మొదటి పేజీ తరువాయి

విరమణకు తాము సిద్ధమంటూ శాంతి చర్చలపై మావోయిస్టులు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో లేఖను విడుదల చేశారు. అయితే, ఆ లేఖలో శాంతి చర్చల కోసం సానుకూల వాతావరణం సృష్టించాలని మావోయిస్టులు కోరారు. అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సానుకూలంగా స్పందించాలని అన్నారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జారండ్, మధ్యప్రదేశ్‌లో జరుగుతోన్న హత్యాకాండను తక్షణమే ఆపేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలకు ప్రతిపాదిస్తే, కాల్పుల విరమణను ప్రకటిస్తామని వారు లేఖలో పేర్కొన్నారు. 2024 జనవరిలో బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు బీజేపీ కేంద్ర ప్రభుత్వం, విప్లవోద్యమ ప్రభావిత రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కగార్ పేరుతో విప్లవోద్యమ ప్రభావిత రాష్ట్రాల ప్రజలపై ప్రతిఘాతక యుద్ధాన్ని ప్రారంభించాయని లేఖలో ప్రస్తావించారు. ఆ సమయంలో ప్రజలను మోసగించడానికి ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం/హోంమంత్రి విజయ్ శర్మ తమ ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపడానికి సిద్ధమే, మావోయిస్టులు చర్చలకు రావాలి అంటూ పదేపదే ప్రకటనలు విడుదల చేశారు. ఆ సందర్భంగా మా పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మీడియా ప్రతినిధి కామ్రేడ్ వికల్ప్ రెండు సార్లు తమ పార్టీ శాంతి చర్చలకు సిద్ధమేనని బదులిచ్చాడి పేర్కొన్నారు.

శాంతి చర్చల కోసం సానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేయడం కోసం, కగార్ పేరుతో ఆదివాసీ ప్రజానీకంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న హత్యాకాండను నిలిపివేయాలని, బస్తర్ ప్రాంతంలో మోహరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సాయుధ బలగాలను బ్యారక్‌లకే పరిమితం చేయాలని కోరారు. సాయుధ బలగాల కొత్త క్యాంపులు ఏర్పాటును నిలిపివేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదన చేశారు. ఈ ప్రతిపాదన పట్ల స్పందించకుండా, జవాబు ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత 15 నెలలుగా విప్లవోద్యమ ప్రభావిత రాష్ట్రాల్లో, ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్‌లో ప్రతిఘాతక కగార్ యుద్ధాన్ని తీవ్రంగా కొనసాగిస్తున్నాయి. విప్లవోద్యమ ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయుధ బలగాలు వేలాది మందిని అరెస్టులు చేసి అక్రమ కేసులు మోపి జైలు పాలు చేస్తున్నాయని లేఖలో అభయ్ ప్రస్తావించారు.

# ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు వాయుసేన గ్రీన్ సిగ్నల్



తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 02 (తీన్మార్ న్యూస్): ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు భారత వాయుసేన గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పౌర విమాన సేవలను ప్రారంభించేందుకు అనుమతులు మంజూరు చేసింది. ఆరు నెలల వ్యవధిలోనే రెండు ఎయిర్ పోర్టులకు అనుమతులు రావడం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అవిశ్రాంత కృషికి దక్కిన ఫలితమన్నారు మంత్రి కోమటిరెడ్డి. ఆదిలాబాద్ ఎయిర్ పోర్టునుఅభివృద్ధి చేసి పౌర విమానయాన సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి భారత వాయుసేన అంగీకరించింది. త్వరలోనే అక్కడ వాయుసేన శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసే యోచనలో కేంద్రం ఉన్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. జాయింట్ యూజర్ ఎయిర్ ఫీల్డ్ గా అభివృద్ధి చేయాలని వాయుసేన లేఖ ద్వారా సూచించిందని కోమటిరెడ్డి తెలిపారు. రన్ వే పునర్నిర్మాణ, పౌర టర్మినల్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఎయిర్ క్రాఫ్ట్ ఎప్రాన్ సహా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు కోమటిరెడ్డి. వీటికి అవసరమైన భూమిని ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు ఇవ్వాలని వాయుసేన సూచించినట్లు చెప్పారు. ఈ విషయంపై అధికారులతో సమీక్షిస్తున్నామని త్వరలోనే అన్ని వివరాలతో కూడిన నివేదికను కేంద్రానికి పంపిస్తామన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.

# జూన్ 1 వరకు ఇంటర్ కాలేజీలకు సమ్మర్ హాలిడేస్

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 02 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో విద్యార్థులకు భారీ శుభవార్త ప్రకటించింది ప్రభుత్వం. తెలంగాణలోని అన్ని జూనియర్ కాలేజీలకు సమ్మర్ హాలిడేస్ ప్రకటించింది. ఇటీవలే వార్షిక పరీక్షలు ముగియగా అకడమిక్ క్యాలెండర్ ప్రకారం వేసవి సెలవులు ప్రకటించారు. జూన్ 1 వరకు అన్ని ఇంటర్ కాలేజీలకు సమ్మర్ హాలిడేస్ ఉంటాయని, తిరిగి జూన్ 2న కాలేజీలు పునఃప్రారంభం కానున్నాయని పేర్కొంది. అన్ని కాలేజీలు ఈ ఉత్తర్వులను తప్పక పాటించాలని, సెలవుల్లో క్లాసులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్ బోర్డ్ హెచ్చరించింది. అదే విధంగా పరీక్ష పేపర్ల స్పాట్ వాల్యుయేషన్ వేగంగా కొనసాగుతోందని ఏప్రిల్ మూడవ వారంలో ఇంటర్ విద్యార్థుల ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు అధికారులు.

# హెచ్సీయూ వివాదంపై స్పందించిన కేంద్ర పర్యావరణ శాఖ

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 02 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపుతున్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో అధికార, విపక్షాలు ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. దీనికి సంబంధించి హైకోర్టులో కేసు సైతం నడుస్తోంది. ఇక ఈ వ్యవహారంపై కేంద్ర పర్యావరణ శాఖ స్పందించింది. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కంచె గచ్చిబౌలి గ్రామంలో అక్రమంగా వృక్షాలను నరికివేయడం, తొలగించడం పై రాష్ట్ర అటవీ శాఖకు లేఖ రాసింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పర్యావరణానికి విఘాతం కలిగించారని, వన్యప్రాణులు, సరస్సులు, పురాతన రాతి నిర్మాణాలకు నష్టం కలిగించారని వివిధ వార్తా పత్రికల్లో కథనాలు వెలువడినట్లు పేర్కొంది. పర్యావరణానికి విఘాతం కలిగించిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అంతేగాక ఇకపై వివాదానికి తావు లేకుండా యూనివర్సిటీలో పర్యావరణానికి విఘాతం కలగకుండా వెంటనే చర్యలు చేపట్టాలని సూచించింది. అక్కడ చెట్లు, జంతుజాలానికి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్రానికి కేంద్రం సలహా ఇచ్చింది. ఈ వ్యవహారంలో నిజా నిజాలపై విచారణ సాగించి, పూర్తి నివేదికను అందించాలని రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శిని కోరింది. కోర్టులు, ట్రిబ్యునల్స్ గతంలో ఇచ్చిన ఆదేశాల ఉల్లంఘన లేకుండా చర్యలు తీసుకోవాలని సూచనలు చేసింది.

# సిల్వర్ జూబ్లీ వేడుకలపై బీఆర్ఎస్ పార్టీ కసరత్తు

హైదరాబాద్, ఏప్రిల్ 02 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలపై కసరత్తు మొదలు పెట్టింది. ఆ పార్టీ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్ కొన్ని రోజుల నుంచి ఉమ్మడి జిల్లాల వారీగా ఎర్రవెల్లిలోని తన ఫామ్ హౌస్ లో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఏప్రిల్ 2న సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి ఫామ్ హౌస్ లో ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లా నేతలతో కేసీఆర్ సమావేశం ముగిసింది. ఏప్రిల్ 27న వరంగల్ లో జరగనున్న బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకలు, మహాసభపై సమావేశంలో చర్చించారు. నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు జరుపుకోవాలని నేతలకు దిశానిర్దేశం చేశారు కేసీఆర్. నియోజకవర్గానికి లక్ష మందికి తగ్గకుండా సభకు తరలి వచ్చేలా ప్లాన్ చేసుకోవాలని ఆదేశించారు. మహాసభ ప్రజలకు మనోధైర్యం వచ్చేలా ఉండాలన్నారు. మహా సభకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చూసుకోవాలని పార్టీ నేతలకు సూచించారు. ఈ సమావేశానికి కేసీఆర్ తో పాటు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు, సునీతా లక్ష్మారెడ్డి, పద్మాదేవెందర్ రెడ్డి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, గంపగోవర్ధన్, గణేష్ బిగాల గుప్త, జాజుల సురేందర్ పలువురు మాజీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఏప్రిల్ 1న ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్ భేటీ అయిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లపై నేతలకు దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం తెలంగాణ ప్రజలు ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నారని ప్రజలు స్వచ్ఛందంగా బహిరంగ సభకు తరలివస్తారని అన్నారు. సభకు వచ్చే జనానికి అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేయాలని నేతలను ఆదేశించారు.

# ఢిల్లీ గద్దె మీద ఎలా ఉంటారో మేము చూస్తాం



మొదటి పేజీ తరువాయి

మీద ఎలా ఉంటారో మేము చూస్తామని మోడీ ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేశారు. బీసీల డిమాండ్లకు మీరైనా దిగి రావాలి లేదా దిగైన పోవాలి అంటూ అల్టిమేట్ జారీ చేశారు సీఎం రేవంత్ రెడ్డి. బుధవారం ఢిల్లీలో బీసీ గర్జన జరిగింది. ఇందులో కాంగ్రెస్ తో పాటు పలు ప్రతిపక్ష పార్టీలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఎన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకించినా ఎన్నో చట్టాలను ప్రధాని మోడీ ప్రజల మీద రుద్దారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రోజు బీసీ రిజర్వేషన్ బిల్లుకు అందరు మద్దతు తెలుపుతుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు సీఎం రేవంత్ రెడ్డి. బలహీనవర్గాల రిజర్వేషన్లు పెంచితే మీకు వచ్చిన బాధ ఏంటి? అంటే మోడీ ప్రభుత్వాన్ని నిలదీశారు సీఎం రేవంత్ రెడ్డి. అటు బండి సంజయ్ పై కూడా తీవ్ర విమర్శలు చేశారు సీఎం రేవంత్ రెడ్డి. బండి సంజయ్ బీసీల కోసం ప్రాణాలు ఇస్తానని అంటున్నాడు. తమకు ప్రాణాలు వద్దు రిజర్వేషన్లు పెంచితే చాలు అంటూ కౌంటర్ ఇచ్చారు సీఎం రేవంత్ రెడ్డి. ఢిల్లీ గద్దె దిగి మీరు మా గల్లీలోకి రావాల్సిందే అంటూ హెచ్చరించారు. బీసీలకు న్యాయం చేస్తే ప్రధాని నరేంద్ర మోడీని సన్మానిస్తామని కూడా తెలిపారు. తెలంగాణలో రిజర్వేషన్లు పెంచుకోవడానికి అనుమతిస్తే పది లక్షల మందితో సభ పెట్టి ప్రధాని నరేంద్ర మోడీని సన్మానిస్తామని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ కామెంట్స్:

- భారత్ జోడో యాత్ర చేసి దేశ ప్రజల సమస్యలు రాహుల్ గాంధీ చూశారు
- తమ వాటా తేల్చాలని బహుజనులు ఆయనను అడిగారు
- అందుకే వాటా తేల్చేందుకు కులగణన చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంది
- ఏ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ఆ రాష్ట్రంలో కులగణన చేస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు
- దేశంలో అధికారంలోకి వచ్చి జనగణనలో కులగణన చేసి దేశ వ్యాప్తంగా బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తాం
- అందుకే నా మీద ఎంత ఒత్తిడి ఉన్నా కులగణన చేసి తీరాం
- బీసీలకు రిజర్వేషన్ లు ఇవ్వాలంటే మీ లెక్క ఎంతో తెలియదు అని కోర్టులు అన్నాయి
- అందుకే లెక్కలు తేల్చాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంది.
- కులగణన చేసి, బీసీ బిల్లును ఫిబ్రవరి 4 తేదీన అసెంబ్లీ తీర్మానం చేశాం.
- అందుకే సోషల్ జస్టిస్ డేగా ఫిబ్రవరి 4ను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
- బీసీలది ధర్మమైన కోరిక. దాన్ని పార్టీలు అమలు చేయాలి
- ఆనాడు మొరార్జీ దేశాయ్ మండల్ కమిషన్ ఏర్పాటు చేశారు
- ఆ కమిషన్ 27 శాతం రిజర్వేషన్ ఇయ్యాలని సూచించింది
- వీపీ సింగ్ అమలు చేస్తామంటే వ్యతిరేకంగా జనతా పార్టీ కమండల్ ఉద్యమాన్ని తెచ్చి అడ్డుకునే ప్రయత్నం చేసింది.
- ఆ జనతా పార్టీ నుంచి వచ్చిన ప్రతినిధే ఈ ప్రధాని మోదీ
- బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాల్సి వస్తుందని, కులగణన చేయాల్సి వస్తుందని బీజేపీ ప్రభుత్వం 2021 జనాభా లెక్కలను చేయలేదు
- బీజేపీ కుట్ర చేసి జనగణన ను వాయిదా వేస్తోంది
- ఇది బహుజనుల సమస్య.. ఏకమై లెక్కలు తేల్చితేనే తప్ప ఉద్యోగ రాజకీయ రిజర్వేషన్లు పెరగవు
- రాష్ట్ర ప్రభుత్వం లెక్కలు చేసి 56.3 శాతం బలహీన వర్గాల లెక్కలు తెలంగాణ ప్రభుత్వం తేల్చింది
- దేశానికి దిక్సూచిగా మొదటిసారి 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కంకణం కట్టుకుంది
- ప్రభుత్వ పరిపాలన, అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం
- రిజర్వేషన్ల అమలు కేంద్ర ప్రభుత్వ పరిధి.. అందుకే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాం
- అయిననూ పోయి రావలెను హస్తినకూ అని మహాభారత యుద్ధ సమయంలో పెద్దలు చెప్పారు
- అందుకే అయిననూ హస్తినకు వచ్చితిమి..
- బీసీ రిజర్వేషన్లకు అనుమతి ఇస్తే తెలంగాణలో 10 లక్షల మందితో సన్మానం చేస్తాం
- కానీ ఎందుకు బీసీ రిజర్వేషన్లకు ఆమోదం ఇవ్వడం లేదు
- చట్టం, అధికారం ఉంది కదా అని మా మీద ఆదిపత్యం
- చలాయించాలని చూస్తే ఊరుకోం
- ఢిల్లీలోనే ఎప్పుడూ ఉండరు..
- మళ్లీ గల్లికి వస్తారు.. మాకు దొరుకుతారు.
- మా దగ్గర లెక్క తేలింది.. మాకు అనుమతి ఇవ్వండి మోదీ గారు అంటే.. ఆయన పట్టించుకోవడం లేదు

తీన్మార్



## పదో తరగతి పరీక్షల సరళి పర్యవేక్షణ

### సాంఘీకం పేపర్ కు 99.94 శాతం మంది విద్యార్థుల హాజరు

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ జిల్లా, ఏప్రిల్ 02 (తీన్మార్ న్యూస్): బుధవారం, జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్క్ వద్ద గల సెయింట్ పాల్స్ పాఠశాలను సందర్శించి, పది పరీక్షల సరళిని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాన్ని పరిశీలించి, వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులను సరిపడా అందుబాటులో ఉంచాలన్నారు. సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ లను సంబంధిత వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్ తో లోపలికి ఎవ్వరినీ అనుమతించవద్దని పేర్కొన్నారు. అదే విధంగా ఎలాంటి లోటు పాట్లకు తావు లేకుండా పరీక్షలు సజావుగా నిర్వహించాలన్నారు. ప్రహారీ గోడ సరిగా లేని చోట భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం బుధవారం నిర్వహించిన సంఘీకం (సోషల్) పరీక్షకు జిల్లా వ్యాప్తంగా (6238) మంది విద్యార్థులకు గాను (6234) మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు వెల్లడించారు. అలాగే నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని, (99.94) శాతం విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారులకు ఏర్పాట్లు చేయాలి

### జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్



మహబూబాబాద్ జిల్లా, ఏప్రిల్ 02 (తీన్మార్ న్యూస్): బుధవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్స్ , మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, డిపిఎంలు, ఏపీఓలు, తదితర అధికారులతో కలిసి రాజీవ్ యువ వికాసం పథకం అమలు, త్రాగునీరు సరఫర, ఎన్ఆర్ఈజిఎస్, పెన్షన్స్, సెర్ఫ్ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాస పథకం ద్వారా జిల్లాలో నిరుద్యోగులైన యువతీ, యువకుల కోసం ప్రభుత్వం తీసుకున్న ఈ పథకం అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించి అందరికి తెలిసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. మున్సిపల్ కార్యాలయాలు, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాలు, ప్రదేశాలలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలన్నారు. మండల స్థాయిలో సర్టిఫికెట్ల జారీలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దరఖాస్తుదారులకు పూర్తి గైడ్ చేయుటకు సిబ్బంది నియమించాలని సూచించారు. జిల్లా ప్రత్యేక అధికారులు ఉదయం,సాయంత్రం రాజీవ్ యువ వికాసం పై నివేదికలు సమర్పించాలన్నారు. జిల్లాలో త్రాగునీటి సరఫరాకు ఎలాంటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, గత సంవత్సరం, ఈ సంవత్సరం వేసవికాలం యాక్షన్ ప్లాన్ ప్రకారం మున్సిపల్, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఎంపీడీవోలు గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు ప్రణాళిక సిద్ధం చేసుకుని ప్రజలకు త్రాగునీరు అందించుటకు సిద్ధంగా ఉండాలని సూచించారు. త్రాగునీరు సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి స్థానిక సోర్స్ ద్వారా సరఫరా చేయాలని అన్నారు. రానున్న ఒకటి రెండు మాసాలలో వేసవి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు, సెర్ఫ్ పెన్షన్, సదరం, యూడిఐడి పోర్టల్ ద్వారా సర్టిఫికెట్లు తదితర అంశాలపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకొని నిజమైన లబ్ధిదారులకు వేగంగా సేవలను అందించాలన్నారు. జిల్లా స్థాయి ప్రత్యేక అధికారులు రేపటినుండి ప్రత్యేక కార్యచరణ ప్రకారము రాజీవ్ యువ వికాసం పథకం, త్రాగునీరు సరఫర, తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో పర్యటించి ఉదయం సాయంత్రం నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు, (రెవెన్యూ),లెనిన్ వత్సల్ టోప్పో, కె.వీర బ్రహ్మాచారి, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జెడ్పి సీఈఓ పురుషోత్తం, డిపిఓ హరిప్రసాద్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ అధికారులు నరసింహస్వామి, శ్రీనివాస్, దేశి రామ్, మండల ప్రత్యేక అధికారులు మరియన్న, సురేష్, శ్రీమన్నారాయణ, విజయనిర్మల, ఇరిగేషన్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా నూతన వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ బి.రవి



మహబూబాబాద్ జిల్లా, ఏప్రిల్ 02 (తీన్మార్ న్యూస్): జిల్లాకు నూతన వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా వచ్చిన డాక్టర్ బి రవి బుధవారం జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ను ఐ.డి.ఓ.సి లోని కలెక్టర్ చాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాను అన్ని ఆరోగ్య కార్యక్రమాలలో ముందంజలో ఉండే విధంగా చూడాలన్నారు. అనంతరం జిల్లా వైద్యాధికారి స్థానిక సంస్థలు అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ వీర బ్రహ్మాచారిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ప్రోగ్రాం అధికారులు, మాస్ మీడియా సెక్షన్ అధికారులు, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ ఆఫీస్ సిబ్బంది, ఎన్ హెచ్ ఎం సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సారంగం, డాక్టర్ సుధీర్ రెడ్డి,డాక్టర్ ప్రమీల,డాక్టర్ నాగేశ్వరరావు,డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ విజయ్ కుమార్ డాక్టర్,శ్రవణ్ కుమార్, డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ , జిల్లా టీఎన్జీవోల అధ్యక్షులు వడ్డెబోయిన శ్రీనివాస్, జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం కార్యదర్శి కొప్పు ప్రసాద్, కె.వి.రాజు, పురుషోత్తం హెల్త్ ఎడ్యుకేటర్స్, తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ బ్రేక్... దుర్గంధ భరితంగా మరుగుదొడ్లు



ఆత్మకూర్ ఏప్రిల్ 02 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోనే ప్రధాన ఆస్పత్రి లో డ్రైనేజీ వ్యవస్థ బ్రేక్ కావడంతో మరుగుదొడ్లు దుర్గంధ భరితంగా దుర్వాసనతో నిండిపోయాయి. దీనితో రోగులు రోగుల సహాయకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు తెలియజేస్తున్నారు. గత నాలుగు రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉన్నట్టు తెలుస్తుంది. దీనిపై సంబంధిత ఆసుపత్రి సిబ్బంది అడగగా డ్రైనేజీ నిలుపుదల అయినట్లు తెలిపారు. ఇట్టి డ్రైనేజీ వ్యవస్థను శుభ్రపరచాలని రోగులు వారి సహాయకులు కోరుతున్నారు.

# భద్రాచలానికి వచ్చే భక్తులు తగిన ఏర్పాట్లు చేయాలి



## తెలంగాణ రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్

భద్రాచలం, 02 ఏప్రిల్ (తీన్మార్ న్యూస్): శ్రీ సీతారామ చంద్రస్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించడానికి భద్రాచలానికి పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా అన్ని శాఖల అధికారులు వారికి అప్పగించిన పనులను బాధ్యతగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్ అన్నారు. బుధవారం నాడు భద్రాచలంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవ వేడుకలు విజయవంతం అవ్వడానికి సంబంధిత శాఖల అధికారుల తరఫున జరుగుతున్న ఏర్పాట్లపై శాఖల వారీగా ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత వైభవోపేతంగా ఎక్కడా లేని విధంగా సీతారాముల వారి కళ్యాణం జరిగేటువంటి పవిత్ర స్థలం మన భద్రాచలం పుణ్యక్షేత్రమని అన్నారు. ఈ క్షేత్రంలో కొన్ని దశాబ్దాల తరబడి సీతారాముల వారి కళ్యాణం ఆనవాయితీగా జరుగుతున్నదని తెలిపారు. కళ్యాణమహోత్సవాన్ని ప్రత్యేకంగా కానీ పరోక్షంగా వీక్షించిన భక్తులకు ఎంతో పుణ్యం వస్తుందని వేదాల్లో చెప్పడం జరిగిందని అన్నారు. పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున పూర్తి స్థాయిలో భక్తులకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మంచినీరు, చలువ పందిళ్లు, వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఫాగ్ లిస్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు కళ్యాణ వేడుకలు వీక్షించేందుకు 26 సెక్టార్లు ఏర్పాటుతో పాటు ప్రతి సెక్టార్ లో ఎల్ ఈ డి టివిలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కళ్యాణ వేడుకలకు విచ్చేయు భక్తులకు స్వామి వారి కళ్యాణ వేడుకలు వీక్షించి జన్మ జన్మల పుణ్యాన్ని పొందేలా అధికారులు కృషి చేయాలని ఆయన అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ సీతారామ చంద్రస్వామి కళ్యాణం పట్టాభిషేకం మహోత్సవాన్ని పురస్కరించుకొని దేవస్థానం తరపున మార్చి 30 నుండి ఏప్రిల్ 12 వ తారీకు వరకు బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనాయని, కళ్యాణం జరిగే ముందు రోజు స్వామివారి ఎదుర్కోళ్ల కార్యక్రమం ఉంటుందని, భక్తుల సౌకర్యార్థం 75% ఆన్లైన్లో టికెట్లు అందుబాటులో ఉంచామని, భక్తులకు లడ్డు ప్రసాదంతో పాటు మహా ప్రసాదం కూడా అందించడానికి ప్రణాళికలు రూపొందించామని, తలంబ్రాల కౌంటర్లు 80 వరకు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి ఆర్టీసీ బస్సులో భక్తులకు కేజీ చొప్పున తలంబ్రాలు అందిస్తున్నామని, సేవల ద్వారా ఆర్టీసీ, పోస్ట్ ఆఫీస్ ద్వారా బుక్ చేసుకున్న వారికి ఇండియన్ ప్రకారం అందిస్తామని అన్నారు. సీఎం రాక కోసం మూడు హెలిప్యాడ్లను సిద్ధం చేస్తున్నామని ఆర్డబ్ల్యూఎస్ మెడికల్ డిపార్ట్మెంట్ ద్వారా అక్కడ అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, కళ్యాణం మరియు పట్టాభిషేకం జరిగే రెండు రోజులు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, జనరేటర్ ను కూడా మిథిలా స్టేడియంలో అందుబాటులో ఉంచుకుంటున్నామని, ఆర్డబ్ల్యూఎస్ ద్వారా భక్తులకు, పార్కింగ్ ఏరియాలలో మరియు సెక్టార్లలో మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్నామని, గ్రామపంచాయతీ ద్వారా శానిటేషన్ తో పాటు భద్రాచలంలోని 25 పాయింట్లు మంచినీటి సౌకర్యంతో పాటు, 15చోట్ల 162 టాయిలెట్లు, మూడు మొబైల్ టాయిలెట్లు ఏర్పాట్లు చేశామని, 560 మంది సిబ్బంది అందుబాటులో ఉంచుకున్నామని అన్నారు. భక్తులు గోదావరి లోకి వెళ్లకుండా భారీ కేడింగ్ ఏర్పాటు చేశామని, లైఫ్ జాకెట్లు, లైఫ్ బాల్స్, 20 మంది గజ ఈతగాళ్లను, రిస్క్ బోట్స్ 15, గోదావరిలో ప్రమాద సూచికలను ఏర్పాట్లు చేసి ప్రజలు ఎవ్వరు గోదావరి లోపల వెళ్లకుండా ప్రత్యేక నిగా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అగ్నిమాపక శాఖ ద్వారా భద్రాచలం పట్టణంలోని ముఖ్యమైన కూడళ్లలో కళ్యాణం జరుగు ప్రదేశాలలో ఆరు ఫైరింజన్లు ఏర్పాట్లు చేస్తున్నామని, వైద్య ఆరోగ్య శాఖ ద్వారా భద్రాచలం, పర్ణశాల, హెలిపాడ్, వాహనాల పార్కింగ్ స్థలాలలో కలుపుకొని 13 మెడికల్ క్యాంపులు,05 అంబులెన్సులు,30 మంది ఫీల్డ్ స్టాఫ్, ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక వార్డు ఐసీయూ 24 గంటలు పని చేసే అంబులెన్స్ తో పాటు ఓఆర్ఎస్ పాకెట్లు అన్ని జబ్బులకు మందులు అందుబాటులో ఉంచుతున్నామని, ఎక్సైజ్ శాఖ ద్వారా 6, 7 తేదీలలో బార్ షాపులు మరియు బెల్టు షాపులు అన్నింటిని క్లోజ్ చేస్తామని, నాలుగు చోట్ల మొబైల్ చెక్పోస్టులు ఏర్పాటు చేసి గట్టిగా పెడుతున్నామని అన్నారు. అధికారులు భక్తులు మాత్రమే స్వామి వారి కళ్యాణం వీక్షించే విధంగా చూడాలని, కుటుంబ సభ్యులకు గానీ, బంధువులకు గాని ప్రాధాన్యత ఇవ్వకూడదని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో జేసి వేణుగోపాల్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్, ఏ ఎస్ పి విక్రాంత్ కుమార్ సింగ్, ఆర్డీవో దామోదర్ రావు, దేవస్థానం ఈవో రమాదేవి మరియు వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అత్త సొమ్ము..అల్లుడి దానం..

### నిధులు కేంద్రానివి..సోకులు రాష్ట్రానివి..

### రేషన్ బియ్యం పై రేవంత్ సర్కార్ తప్పుడు ప్రచారం..

### 5కిలోలు కేంద్ర ప్రభుత్వం,1 కిలో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం వాటా..

### కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీ బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి



ఆత్మకూర్ ఏప్రిల్ 02 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తుంది. వాడవాడల కాంగ్రెస్ నేతలు,ప్రజా ప్రతినిధులు సన్న బియ్యం పథకాన్ని ప్రారంభిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అద్భుత పథకంగా జోరుగా ప్రచారం చేసుకుంటున్న నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ మాత్రం కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తుంది.ఈ సందర్భంగా బిజెపిరాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ" సొమ్మొకడిది..సోకొకడిది"అన్న చందంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహారం నడుస్తుందని, పేద ప్రజలకు ఇచ్చే 6 కిలోల బియ్యంలో 5 కిలోలు కేంద్ర ప్రభుత్వం ఇవ్వగా రాష్ట్ర ప్రభుత్వం కేవలం 1 కిలో మాత్రమే ఇస్తుందని, కరోనా సమయం నుండి కేంద్ర ప్రభుత్వమే ఐదు కిలోల బియ్యాన్ని ఉచితంగా అందిస్తుంది కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు మాత్రం అందుకు భిన్నంగా తామే పూర్తిగా భరిస్తున్నట్లు,మంత్రులు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ నాయకులు జోరుగా ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందని, తెలంగాణ రాష్ట్రంలో ప్రతి సంవత్సరం రేషన్ బియ్యం పథకం కోసం కేంద్ర ప్రభుత్వం పదివేల కోట్లు ఖర్చు చేయడం అక్షర సత్యమని, కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పే మాటలు..చేసే పనులకు పొంతన లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే పదివేల కోట్లు భరిస్తుందని బహిరంగ సభలలో చెప్పడం సిగ్గుచేటని బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి మండిపడ్డారు. అదేవిధంగా ప్రజా సంక్షేమం. అప్పులే పుట్టట్లేదు, ఖజానా ఖాళీ అయింది, అని చేతులెత్తేసిన మీకు సన్న బియ్యానికి డబ్బులెక్కడ నుంచి వచ్చినవి అని ఈ సందర్భముగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజాపాలన అని డబ్బా కొట్టుకుంటున్న కాంగ్రెస్ నేతలు తాము ఇచ్చిన ఎన్నికల హామీలు కళ్యాణ లక్ష్మి పథకంలో తులం బంగారం, మహిళా భరోసా కింద ప్రతి మహిళకు 2500 నగదు,4,000/- వృధాప్య పింఛన్ ఇవ్వలేదు, కౌలు రైతులకు 12,000/- ఇవ్వలేదు, మహిళలకు స్కూటీలు ఇవ్వలేదు,పూర్తిగాని రైతు భరోసా, ఇలా అన్ని పథకాలు పక్కకు పెట్టి, “అత్త సొమ్ము అల్లుడు దానం “అన్న చందంగా కాంగ్రెస్ సర్కార్ ప్రచారం చేసుకుంటుందని, త్వరలోనే భారతీయ జనతా పార్టీ కాంగ్రెస్ కుట్రలను తిప్పి కొడుతూ నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశ అభివృద్ధిని, ప్రజలకు జరుగుతున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయి-లో ప్రజలకు వివరిస్తామని,రాబోయే స్థానిక ఎన్నికల్లో బిజెపి సత్తా ఏంటో తెలుస్తుందని బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి అన్నారు.

# లబ్ధిదారులు సన్న బియ్యం పథకాన్ని వినియోగించుకోవాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్

జనగామ జిల్లా, ఏప్రిల్ 02 (తీన్మార్ న్యూస్): లబ్ధిదారులు సన్న బియ్యం పంపిణీ పథకాన్ని వినియోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ కోరారు. బుధవారం, నర్మేట మండలంలోని హన్మంతాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల రేషన్ దుకాణంలో (షాప్ నంబర్ 9) ఏర్పాటు చేసిన సన్న బియ్యం పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ హాజరయ్యి, రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అదే విధంగా రేషన్ కార్డుదారులకు సన్న బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారుడికి సన్న బియ్యాన్ని అందించాలన్న చారిత్రాత్మక పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. సన్న బియ్యంతో పాటు ప్రభుత్వం అందిస్తోన్న అన్ని సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ ఉపయోగించుకొని, అభివృద్ధి సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, డీలర్ విజయలక్ష్మి, రేషన్ డీలర్ అసోసియేషన్ సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# నిరుపేదలు కడుపు నిండా తినాలనే సన్న బియ్యం పంపిణీ

### దేశంలో ఎక్కడలేని విధంగా పేద ప్రజలకు సన్నం బియ్యం

### అజ్జకొల్లు గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

### దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి





దేవరకద్ర ప్రతినిధి, ఏప్రిల్ 02 (తీన్మార్ న్యూస్): నిరుపేదలు కడుపు నిండా తినాలనే ఉద్ధేశంతో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం అందించేందుకు శ్రీకారం చుట్టారని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత సన్న బియ్యం పథకాన్ని వనపర్తి జిల్లా మదనాపురం మండలం తీర్మాలయపల్లి గ్రామంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ప్రారంభించి లబ్ధిదారులకు స్వయంగా బియ్యం పంపిణీ చేశారు.అజ్జకొల్లు గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతాంగం పండించిన సన్నరకం ధాన్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతు ధరతో పాటు అదనంగా క్వింటాల్ వెంట రూ.500 బోనస్ ఇచ్చి అండగా నిలుస్తున్నామన్నారు.ఈ గ్రామంలో 500 బోనస్ డబ్బులు 17 లక్షలు వేశామని,గ్రామంలోని పాత రేషన్ కార్డులు 670 మరియు కొత్త రేషన్ కార్డులు 246 కాగా 14,391 క్వింటాలు బియ్యాన్ని ప్రజలకు అందిస్తున్నామనితెలిపారు.గ్రామంలోని రెండు లక్షల రుణమాఫీ కోటి యాభై లక్షలు చేశామని అన్నారు.దేశంలో ఎక్కడా పేద ప్రజలకు సన్నం బియ్యం అందించలేదన్నారు.తమ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తూ సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చు ట్టిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తుందన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల ఉద్దేశ్యం, సామాన్య ప్రజలకు ఆర్థిక భారం తగ్గించి,వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా చేయడమే అన్నారు.ఈ పథకం ద్వారా అర్హత గల కుటుంబాలకు నాణ్యమైన బియ్యాన్ని ఉచితంగా పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని, ప్రతి పేద కుటుంబం ఆకలికి గురికాకుండా,పోషకాహారాన్ని సమృద్ధిగా అందుకునేలా ఈ పథకం రూపొందించబడిందని తెలిపారు.అందరి సహకారంతో ఈ కార్యక్రమాన్ని సజావుగా అమలు చేస్తామని తెలిపారు. బియ్యం పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభం



ఆత్మకూర్ ఏప్రిల్ 02 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలకు సన్న బియ్యం కార్యక్రమాన్ని వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం ఖానాపూర్ గ్రామంలో తాసిల్దార్ చాంద్ పాషా లబ్ధిదారులకు రేషన్ షాపులో సన్న బియ్యాన్ని పంపిణీ చేశారు. ఇట్టి కార్యక్రమంలో ఖానాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎస్ వెంకటన్న టౌన్ జనరల్ సెక్రెటరీ ఎస్ రవీందర్ ఆత్మకూరు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సంగేపాగా వంశీ ఏవైసీ సెక్రటరీ గడ్డం శ్రీకాంత్ దావీదు మాధ్యవాడి మెంబర్ రేషన్ డీలర్ బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదుగుదలకే వడ్డీ లేని రుణాలు

**పదిమందికి ఉపయోగకరంగా ఎదిగిన సంఘాలు**

**వడ్డీ లేని రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి**

**రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)**



ములుగు జిల్లా, మార్చి 02 (తీన్మార్ న్యూస్): మహిళలు ఆర్థికంగా ఎదగడానికి పలు వ్యాపారాలు చేసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను మంజూరు చేస్తున్నదని, నేడు స్వయం సహాయక సంఘాలు 10 మందికి సహాయపడే విధంగా ఎదిగాయని రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ప్రతి ఇంట్లోని మహిళా చేతిలో పది రూపాయలు ఉంటే ఆ కుటుంబంతో పాటు ఆ గ్రామం బాగుంటుందని అభిప్రాయపడ్డారు. బుధవారం గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలో స్వయం సహాయక సంఘాల మహిళలచే నిర్వహించిన సమావేశం అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జ్జీ, డి ఆర్ డి ఓ సంపత్ రావు అధ్యక్షతన జరిగే ముఖ్య అతిథులుగా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, సెర్ఫ్ సీ ఈ ఓ దివ్య, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ ఇప్పటివరకు 250 వందల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు అందించామని, రాష్ట్రంలో 67 లక్షల మంది డ్వాక్రా గ్రూప్ మహిళలు ఉన్నారని తెలిపారు. గత 30 సంవత్సరాల క్రితం పది రూపాయల పొదుపుతో ఏర్పడిన స్వయం సహాయక బృందాలు నేడు

క్రమ శిక్షణతో మెలుగుతూ కోట్లాది రూపాయలను పొదుపు చేసుకొని అవసరాల కోసం వాడుకుంటు, పది మందికి ఉపాధి కల్పన కోసం తీసుకున్న రుణాలకు ప్రభుత్వం వడ్డీ చెల్లిస్తుందని వివరించారు. ఆర్థిక స్వాలంబన కోసమే రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తున్నదని, వడ్డీ లేని రుణాలను అందించడంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డు మహిళల పేరుపైనే అందించడం జరుగుతుందని తెలిపారు. ఇంట్లో నీ ప్రతి మహిళ చేతిలో పది రూపాయలు ఉంటే ఆ కుటుంబానికి ఎంతగానో దోహద పడతాయని, గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. ములుగు జిల్లా పర్యాటక ప్రాంతంగా మారడంతో రామప్ప, లక్నవరం, భోగత జలపాతం, సమ్మక్క సారలమ్మ జాతర, లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం లాంటి ప్రాంతాలలో మహిళలు పలు రకాల వ్యాపారాలు చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు అందించిందని దీంతో మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. మహిళలంతా ఒకే జాతి అని, 15 సంవత్సరాలు నిండిన య-ువతులను సంఘాలలో చేర్పించిన పక్షంలో వారు సైతం ఆర్థికంగా ఎదుగుతారని అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ఏ మహిళ సైతం కన్నీరు పెట్టకుండా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సోదరుడిలా మహిళలకు చేయూత అందిస్తున్నారని, ప్రభుత్వం అందిస్తున్న రుణాలతో మహిళలు అన్ని రంగాలలో ఎదగాలని కోరారు. అనంతరం మంత్రి సీతక్క మహిళ సంఘాలకు చెక్కులను అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, అదనపు పి డి, ఎంపిడిఓ, డి పి ఎం, మహిళ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క



ములుగు జిల్లా, ఏప్రిల్ 02 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క. బుదవారం ములుగు జిల్లా కేంద్రంలో రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబం కడుపు నిండా సన్న బియ్యంతో భోజనం చేయడం లక్ష్యంగా చేపట్టిన సన్న బియ్యం పథకాన్ని రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ లతో కలసి ప్రారంభించారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాది ముభారాక్ లబ్ధిదారులకు 20 మందికి చెక్కులను మంత్రి అందచేశారు. ఈ కార్యక్రమంలో డి సి ఎస్ ఓ షా ఫైజల్ హుస్సేని, డి ఎం డి సి ఎస్ ఓ రాంపతి, తహసిల్దార్ విజయ భాస్కర్, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి ఘనంగా నివాళ్లు

**బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు పొన్నం బిక్షపతి గౌడ్**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఏప్రిల్ 02 (తీన్మార్ న్యూస్): ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఈసీ మెంబర్ సంగీ రవి జిల్లా ఇంచార్జ్ వేల్పుగొండ మహేందర్ హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పొన్నం బిక్షపతి గౌడ్ గారు మాట్లాడుతూ బహుజన రాజ్యాన్ని 350 సంవత్సరాల క్రితమే స్థాపించి అణగారిన వర్గాలకు రాజ్యాధికార కాంక్ష భావితరాలకు తెలియజేసిన బహుజన నాయకుడని తన రాజ్యంలో 21కోటలను కట్టించి బహుజన బిడ్డలను రాజులుగా చేసి గోల్కొండ కోట నుండి పరిపాలన సాగించిన చక్రవర్తిగా తెలంగాణ గడ్డపై పరాయి పాలనకు వ్యతిరేకంగా పోరాడుతూ మొగలుల దండయాత్రలను తరిమికొట్టిన పోరాట యోధుడని భూమిని భుక్తిని అగ్రవర్ణాల చెర నుంచి విడిపించిన గొప్ప రాజనీతిజ్ఞుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గారు అని రాష్ట్రంలో ఏదైనా ఒక చరిత్రత్మక కట్టడానికి ఒక ప్రాంతానికి ఆయన పేరు పెట్టాలని చరిత్రను వారసత్వాన్ని కనుమరుగు చేయాలనుకుంటున్నా అగ్రవర్ణాల పార్టీలను రాబోయే రోజులలో ఓటు అనే ఆయుధంతో భూస్థాపితం చేస్తామని ఆ మహనీయుడి ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలో బహుజన రాజ్యాధికారాన్ని సాధిస్తామని తెలిపారు

ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మేకల ఓంకార్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు రాజ్ కుమార్ భూపాలపల్లి మండల అధ్యక్షులు బుర్రి కుమారస్వామి మండల ఉపాధ్యక్షులు రేణికుంట్ల సునీల్ టేకుమట్ల మండల అధ్యక్షులు సంగి రవి వర్మ చిట్యాల మండల నాయకులు దేవేందర్ ఘనపూర్ మండల నాయకులు జీడి రాజ కొమురయ్య గారు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా మెపా గౌరవ అధ్యక్షుడు రాజు జన్మదిన వేడుకలు

**పెద్దమ్మ తల్లి ఆశీస్సులు ముదిరాజులందరిపై ఉండాలి**

**మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్**

ములుగు, ఏప్రిల్ 02 (తీన్మార్ న్యూస్): బుధవారం ములుగు జిల్లా కేంద్రంలో'ని మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్) జిల్లా కార్యాలయంలో మెపా జిల్లా అధ్యక్షుడు అచ్చునూరి కిషన్ ముదిరాజ్ అధ్వర్యంలో మెపా గౌరవ అధ్యక్షుడు బండి రాజు ముదిరాజ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెపా వ్యవస్థాపక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ విచ్చేసి బండి రాజు కి శాలువా తో సన్మానం చేసి కేక్ కట్ చేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ మెపా ములుగు జిల్లా గౌరవ అధ్యక్షుడు బండి రాజు ముదిరాజ్ కు మన ఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ఇంకా ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, రానున్న రోజుల్లో ఉన్నతమైన స్థానంలో ఉండి ములుగు జిల్లాలో జాతి ఐక్యత కు కృషి చేయాలని తెలుపుతూ, ముదిరాజ్ లు అందరు ఐక్యంగా ఉంటూ జాతి అభివృద్ధి'లో భాగస్వామ్యులు కావాలని, పార్టీ సిద్ధాంతాలు వేరైనా జాతి సిద్ధాంతం కోసం పని చేయాలని తెలియజేశారు. అలాగే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా ప్రతి గ్రామంలో జాతి బిడ్డల గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెపా ములుగు జిల్లా అధ్యక్షుడు అచ్చునూరి కిషన్ ముదిరాజ్, మెపా గౌరవ అధ్యక్షుడు బండి రాజు ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల నాగరాజు ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు భూమ నరేష్ ముదిరాజ్, వెంకటాపూర్ మండల అధ్యక్షుడు మేకల రమేష్ ముదిరాజ్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్, మహబుబబూబ్ జిల్లా అధ్యక్షుడు దండి అశోక్, చొప్పరి రాజేందర్, మానగాణి మల్లికార్జున్, పోలుదాసరి రాము, మల్లేబోయిన వెంకటేష్, అరవింద్, సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.




# జవహార్ నగర్ డంపింగ్ యార్డ్ ను పరిశీలించిన కలెక్టర్లు, కమిషనర్

**ఆధునిక టెక్నాలజీతో చెత్త వేరు చేస్తున్న పద్ధతుల పరిశీలన**

**జీడబ్ల్యుఎంసీలో ఇదే తరహా విధానం అమలుకు యోచన**

**రాంపూర్ డంపింగ్ యార్డును పరిశీలించనున్న రాంకీ సంస్థ ప్రతినిధులు**





వరంగల్ జిల్లా, ఏప్రిల్ 02 (తీన్మార్ న్యూస్): జిహెచ్ఎంసి పరిధిలోని జవహార్ నగర్ డంపింగ్ యార్డును వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, ప్రావీణ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే బుధవారం సందర్శించారు. జీహెచ్ఎంసీలో అమలవుతున్న ఘన వ్యర్థాల నిర్వహణ పద్ధతి, చెత్త నుంచి విద్యుత్తు తయారీ, చెత్త ట్రాన్స్ఫర్ తయారీ స్టేషన్లను వారు పరిశీలించారు. హైదరాబాద్ లోని వివిధ డివిజన్ల నుండి చెత్తను ఏ విధంగా తరలిస్తున్నారు. డంపింగ్ యార్డు వద్ద ఎలాంటి పద్ధతులను అనుసరిస్తున్నారు. చెత్తను ఏ విధంగా రీసైక్లింగ్ చేస్తున్నారనే విషయాలను క్షేత్రస్థాయిలో ఇరువురు కలెక్టర్లు, కమిషనర్ అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ చెత్తతో విద్యుత్తును ఉత్పత్తి చేయడం అద్భుతమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని చెత్తను జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌కు తరలించి ఆధునిక టెక్నాలజీతో అద్భుతాలు సృష్టించడం అభినందనీయమని కలెక్టర్లు కొనియాడారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డులో చెత్త నుంచి కరెంట్, గ్యాస్‌ను తయారు చేస్తున్న విధానాన్ని పరిశీలించామని, ఇదే తరహాలో గ్రేటర్ వరంగల్ లో అభివృద్ధి చేస్తామని చెప్పారు. డంపింగ్‌యార్డ్‌లో కొత్త టెక్నాలజీతో చేస్తున్న అధ్యయనాలు బాగున్నాయని వారు ఈ సందర్భంగా కితాబిచ్చారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై స్టడీ టూర్‌లో భాగంగా డంపింగ్‌యార్డ్‌ను సందర్శించిన కలెక్టర్లు అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెత్త నుండి వేరు చేయడానికి అనుసరిస్తున్న ఆధునిక పద్ధతులు, వ్యర్థ పదార్థాల ద్వారా వివిధ రకాల ఉత్పత్తి, నిర్వహణ గురించి కలెక్టర్లు, జిడబ్ల్యు ఎంసీ కమిషనర్ లకు ఘన వ్యర్థాల నిర్వహణ చేపడుతున్న రాంకీ సంస్థ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాంపూర్ డంపింగ్ యార్డు ను జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ వద్ద సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిర్వహణ బాధ్యతలను నిర్వహిస్తున్న రాంకీ సంస్థ ప్రతినిధులు జిడబ్ల్యుఎంసీ కు శుక్రవారం సందర్శించి రాంపూర్ డంపింగ్ యార్డ్ వద్ద శాశ్విత ప్రతిపాదికన అనుసరించవలసిన పద్ధతులను, సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిడబ్ల్యు ఎంసీ ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర, సి ఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, సంబంధిత అధికారులు, రాంకి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ద్రోహి సీఎం రేవంత్ రెడ్డి

**హెచ్సీయూ భూముల జోలికొస్తే ఊర్కోం**

**ఏబిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మంద నరేష్**

**కాకతీయ యూనివర్సిటీలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దగ్ధం**



హనుమకొండ కేయు, ఏప్రిల్ 02 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకు తీవ్రంగా అన్యాయం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విద్యార్థి లోకం తగిన బుద్ధి చెప్పాలని ఏబిఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మంద నరేష్ అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను రేవంత్ రెడ్డి ప్రభుత్వం లక్కోవడాన్ని నిరాషిస్తూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు శాంతయుతంగా నిరసనతెలియజేస్తుంటే వారిపై సీఎం లాటి చార్జ్ చేయడాన్ని నిరషిస్తూ కాకతీయయూనివర్సిటీ లైబ్రరీ ముందు ఏబిఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వదిష్టి బొమ్మను దాహనం చేయడం జరిగింది. అనంతరం మంద నరేష్ మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడాలని విద్యార్థులు విద్యార్థి సంఘాల నాయకులు పోరాటాలు చేస్తుంటే పోలీసులు అక్రమంగా అరెస్టులు చేసి కేసులు పెట్టడం సిగ్గు చెటని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో బుల్డోజు రులను పెట్టి మూగజీవాల ప్రాణాలు తీయడం చాలా బాధాకరం అని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు గత వారం రోజుల నుండి మా యూనివర్సిటీ భూములను వేలం వెయ్యద్దు అని ఉద్యమాలు చేస్తుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థులపై అక్రమంగా లాఠీచార్జిలు చేపిస్తూ అరెస్టులు చేస్తున్నారన్నా.రు కార్పొరేట్ ప్రైవేటు వ్యక్తులకు యూనివర్సిటీ భూములను కట్టబెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుందన్నారు విద్యార్థులు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో దొరల రాజ్యం నడుస్తుందన్నారు ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి యూనివర్సిటీ విద్యార్థులకు విద్యార్థి సంఘ నాయకులకు క్షమాపణలు చెప్పి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీల భూముల జోలికి మేము వెళ్ళమని బహిరంగంగా ప్రెస్ మీట్ పెట్టి చెప్పాలన్నారు లేదంటే రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులకు మద్దతుగా విద్యార్థి ఉద్యమాలను ఉదృతం చేస్తామని మంద నరేష్ హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఏభి ఎస్ఎఫ్ కెయూ నాయకులు అర్షం చరణ్ పోతుల విష్ణు కొమ్ము మధు విజయ్ విష్ణు కిరణ్ సాయి రవి రమేష్ వెంకటేష్ సురేష్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# ఓరుగల్లు పోరు బిడ్డ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

**మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**




హనుమకొండ, ఏప్రిల్ 02 (తీన్మార్ న్యూస్): బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం రోజున నిర్వహించారు. దక్కన్ గడ్డపై మొదటిసారిగా బహుజన రాజ్యాన్ని స్థాపించిన తొలి బహుజన పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న అని కొనియాడారు. ఒక సాధారణ కులంలో జన్మించి ఆనాటి సామాజిక వ్యవస్థలోనున్న ఆధిపత్య కులాల అధికారాన్ని, బానిసత్వాన్ని ధిక్కరించి దళిత బహుజనులను రాజ్యాధికారం వైపు నడిపిన తొలి బహుజన రాజు అని అన్నారు. పాపన్న స్ఫూర్తిదాయక పోరాటం ముందు తరాలకు అందించాల్సిన అవసరం ఉంది. కులం, మతం, వర్గం, జాతి, అనే సమాజ విచ్ఛిన్నకర అంశాలను పక్కనపెట్టి బహుజన రాజ్యాధికారం కోసం పోరాడాల్సిన అవసరం ఉంది అని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, బీఆర్ ఎస్ పార్టీ జనార్ధన్ గౌడ్, పులి రజినీకాంత్, సల్వాజీ రవీందర్రావు, ఇమ్మడి లోహిత, రాజు, పున్నం చందర్ రఘు, ఖలీల్, శ్రీనివాస్, రాజు, జె కే, వసంత్, దేవమ్మ, సంపత్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రం

## క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు




**హైదరాబాద్,ఏప్రిల్ 2 :** వారంరోజులుగా ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతూనే ఉన్నాయి. అక్కడక్కడా వాతావరణంలో మార్పులు కనిపిస్తున్నా ఇప్పటికే అనేక చోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువగా ఉంటోంది. వాతావరణశాఖ హెచ్చరికలు మరింత భయపెడు తున్నాయి. ఏపీ, తెలంగాణలో సూర్యుడి విశ్వరూపంతో పలు ప్రాంతాలకు హెచ్చరికలు జారీ చేశారు. ఉష్ణోగ్రతలు మరింత పెరుగు తాయని ఐఎండీ అంచనా వేసింది. మరి ఏప్రిల్ మొదటి రోజునే ఇలా ఉంటే ముమ్ముందు పరిస్థితి ఎలాగుంటుందన్న ఆందోళన కలుగుతోంది. ఇదే ఇప్పుడు తీవ్ర భయాందోళనలు రేపుతోంది. ఎందుకంటే ఏప్రిల్, మే రెండు నెలలు తీవ్రంగా ఉండనున్నాయి. తెలుగు రాష్ట్రాలకు వాతావరణశాఖ డేంజర్ వార్నింగ్ ఇచ్చింది. రోజు రోజుకీ తెలుగు రాష్ట్రాల్లో భానుడు భగభగ మండిపోతున్నాడు. ఉదయం ఏడు గంటలకే చెంప చెళ్లుమనిపిస్తూ 8 గంటలకల్లా చుక్కలు చూపిస్తున్నాడు. సెగలు కక్కుతోన్న సూరీడు, పది గంటలకు నడినెత్తిన మంట పెట్టినట్టు పొగలు సెగలు రేపుతున్నాడు. వారం రోజులుగా ఏపీ, తెలంగాణలో ఎక్కడచూసినా ఇదే పరిస్థితి. పలు ప్రాంతాల్లో ఉదయం 11గంటలకే రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నా యంటే సూర్యుడి విశ్వరూపం అర్థంచేసుకోవచ్చు. పైగా రాబోయే మూడు రోజుల్లో ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయంటూ వాతావరణశాఖ హెచ్చరించింది. అప్రమత్తంగా ఉండాలంటూ అలర్ట్ జారీ చేసింది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో మధ్యాహ్నం ఇళ్ల నుంచి బయటికి రావడానికి జంకుతున్నారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలకు తోడు, వడగాల్పులు కూడా ఊహించని స్థాయిలో ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. ఏప్రిల్ సెకండ్ వీక్ తర్వాత నిప్పుల కుంపటేనని హెచ్చరిస్తోంది. రాత్రుళ్లు సైతం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కూలర్లు, ఏసిల మోతలు వినిపిస్తున్నాయి. సాధారణం కంటే 2,3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే ఇక రానున్న రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. రాత్రిపూట కూడా ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. ఇరు రాష్ట్రాల్లో వడగాల్పులు ప్రభావం ఉంటుందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, నిజామాబాద్, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబ్ నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్ జిల్లాల్లో క్రమంగా ఉష్ణోగ్రతల పెరుగుదల కనినిస్తోంది. తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మంచినీరు ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని.. ఎక్కువగా కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటివి తాగాలని చెబుతున్నారు. డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని పేర్కొంటున్నారు.

# ఔదార్యంలో రతన్ టాటా టాప్

## ఆస్తిని అందరికి పంచిన తీరు అభినందనీయం

## వీలునామాలో ప్రకటించిన తీరుపై సర్వత్రా చర్చ



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 2 :** భారత దేశం ఉన్నంత కాలం రతన్ టాటా పేరు చిరస్మరణీయంగా ఉంటుంది. అంతటి సేవా గుణానికి ప్రతీక ఆయన అని వేరుగా చెప్పనక్కరలేదు. బతికుండగానే దేశం కోసం ఎన్నో త్యాగాలను చేశారు. ఎంతో సేవ చేశారు. దేశం పారిశ్రామికంగా వృద్ధి చెందేందుకు అనేక చర్యలు తీసుకున్న పారిశ్రామికవేత్తగా పేరు గడించారు. గతేడాది చనిపోయిన రతన్ టాటా ఔదార్యం మరోసారి వెల్లడైంది. తన వీలునామాలో రూ. 3800 కోట్ల ఆస్తిని దాతృత్వానికి ఇచ్చారు. ఆస్తుల్లో సింహభాగాన్ని ఛారిటీలకు కేటాయించారు. మిగిలిన దానిని కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఉద్యోగులు, జంతువుకు చెందేలా వీలునామా రాశారు. రతన్ టాటాకు రూ. 10 వేల కోట్ల ఆస్తులు ఉండగా, రూ. 3800 కోట్లను దానధర్మాలకే వినియోగించారు. రతన్ టాటా గతేడాది అక్టోబర్ 9 మరణించారు. ఆయన వీలునామా తాజాగా వెలుగులోకి వచ్చింది. తన ఆస్తిలో చాలా ఎక్కువ భాగాన్ని రతన్ టాటా ఎండోమెంట్ ఫౌండేషన్, రతన్ టాటా ఎండోమెంట్ ట్రస్ట్‌లకు కేటాయించారు. షేర్లు, ఇతర పెట్టుబడులు, ఆస్తులు దాతృత్వానికే చెందుతాయని వీలునామాలో పేర్కొన్నారు. బ్యాంకుల్లో ఫిక్స్డ్ డిపాజిట్లు–, స్టాక్స్ మొత్తం రూ. 800 కోట్లలో మూడోవంతును తన సవతి తల్లి కుమార్తెలైన షరీన్ జేజీబాయి, డియాన్నా జేజీబాయికి రాశారు. రూ. 800 కోట్లలో మూడో వంతును టాటా మాజీ ఉద్యోగి, అత్యంత ఆప్తుడైన మోహిని ఎం దత్తాకు ఇచ్చారు.తన ప్రాణ స్నేహితుడైన మోహ్లీ మిస్త్రీక్రి అలీబాగ్‌లో ఇంటిని, మూడు తుపాకులను ఇచ్చారు. తన పెంపుడు జంతువుల కోసం ఆయన రూ. 12 లక్షలు కేటాయించారు. తన వద్ద ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్‌గా పనిచేసిన శంతను నాయుడికి ఇచ్చిన ఎడ్యుకేషన్ లోన్‌ని మాఫీ చేశారు. పొరుగింటి వ్యక్తి జేక్ మాలైట్ కు ఇచ్చిన వడ్డీ లేని రుణాన్ని మాఫీ చేశారు. ఇదిలా ఉంటే తన వద్ద పనిచేసని వంటవాడిని కూడా రతన్ టాటా మరిచిపోలేదు. తనకు ఎప్పటి నుంచో వండిపెడుతున్న కుక్ రజన్ షాకు రూ. 1 కోటి ఇచ్చాడు. ఇంటి పనులు చేసే సుబ్బయ్యకు రూ. 66 లక్షలు, సెక్రటరీ డెల్నాజ్‌కి రూ. 10 లక్షలు ఇవ్వాలని వీలునామాలో పేర్కొన్నాడు. ఇప్పుడా వీలునామపై సర్వత్రా చర్చించుకుంటున్నారు. ఆయన ఔదార్యాన్ని శ్లాఘిస్తున్నారు.

# 2న ప్రపంచ ఆటిజమ్ అవగాహన దినోత్సవం



**విజయవాడ,ఏప్రిల్ 2 :** ప్రతి సంవత్సరం ఏప్రిల్ 2 వ తేదీన ప్రపంచ ఆటిజమ్ అవగాహన దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు. 2008 నుంచి దీనిని ఆచరిస్తున్నారు. ఆటిజమ్ పై 18 డిసెంబర్ 2007 న ఆమోదించిన ఒక తీర్మానం ద్వారా ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ప్రపంచ ఆటిజమ్ అవగాహన దినోత్సవాన్ని నిర్వహించడం ప్రారంభించింది. ఈ వ్యాధితో బాధపడే పెద్దలు,ప్రత్యేక అవసరాలు గల పిల్లల జీవితాలను మెరుగుపరచి, వారికి తోడ్పాటును అందించడం కోసం ఈ తీర్మానాన్ని ఆమోదించారు. ఆటిజమ్ అంటే.. కొందరు పిల్లలు ఎవరితోనూ కలవకపోవటం, ఒంటరిగా ఉండటానికే ఇష్టపడుతుండటం, సరిగా మాట్లాడలేకపోతుండటం వంటి భిన్న లక్షణాలను కలిగి ఉంటే వారికి ఆటిజమ్ ఉన్నట్టు. ఆటిజమ్ భిన్న విభాగాలకు విస్తరించిన ఎదుగల సమస్య. దీన్నే పర్వేసివ్ డెవలప్‌మెంటల్ డిజార్డర్స్ అంటారు. వీరందరిలోనూ కొన్ని రకాల లక్షణాలు ప్రత్యేకంగా కనబడతాయి. కొన్ని అంశాల్లో ఎదుగుదల అస్తవ్యస్త మవుతుంది.గుర్తించేదెలా. మరీ చిన్నవయసులో.. అకారణంగా నిరంతరంగా ఏడ్వటం గంటల తరబడి స్తబ్దుగా ఉండటం.. తల్లి దగ్గరకు తీసుకుంటున్నా పెద్దగా స్పందించకపోవటం.. పరిచిత వ్యక్తులను చూడగానే నవ్వక పోవటం తల్లిదండ్రులు రమ్మని చేతులు చాచగానే ఉత్సాహంగా ముందుకు రావాల్సిన పిల్లల్లో అలాంటి స్పందనలేవీ కనిపించకపోవటంకాస్త పెద్దవయసులో..? మిగతా పిల్లలతో కలవకపోవటం పిలిస్తే పలకకపోతుండటం.. పెరిగే కొద్దీ ఒంటరిగా ఉండటానికే ఎక్కువగా ఇష్టపడుతుండటం..మనుషుల కంటే బొమ్మలు, వస్తువుల పట్ల ఆసక్తి ఎక్కువగా ఉండటం ఎవరైనా పలకరించినా వెంటనే సమాధానం ఇవ్వకపోవటం కళ్లలో కళ్లు పెట్టి చూడకపోతుండటం..

ముఖంలో భావోద్వేగాలేవీ చూపించకపోతుండటం స్పీచ్ థెరపీ, లాంగ్వేజ్ స్టిమ్యులేషన్ ఒక పద్ధతి ప్రకారం ఉదయం నుంచి రాత్రి వరకూ పిల్లలతో మాట్లాడుతుండటం, సంభాషణా సామర్థ్యం పెరిగేలా చూడటం అవసరం. దీనికి స్పీచ్ థెరపీ దోహదం చేస్తుంది. కళ్లలో కళ్లు పెట్టి చూడటాన్ని అలవాటు చేసేందుకు శిక్షణ, అలాగే మలమూత్ర విసర్జన కోసం టాయ్ లెట్ ట్రైనింగ్ వంటివన్నీ పద్ధతి ప్రకారం నేర్పిస్తారు. క్రమేపీ స్థాయిలను పెంచుకుంటూ వెళతారు. దీంతో మెదడులో లోపం క్రమేపీ సర్దుకుంటుంటుంది.

# పలు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం : వాతావరణశాఖ



**హైదరాబాద్, ఏప్రిల్ 2 :** మధ్య మహారాష్ట్ర దాని పరిసర ప్రాంతాలలో సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఆవర్తనం కొనసాగుతోంది. మధ్య మహారాష్ట్ర దాని సమీప ప్రాంతాల్లో ఉన్న ఉపరితల ఆవర్తనం నుంచి కర్ణాటక, తమిళనాడు మీదుగా కొమరీన్ ప్రాంతం వరకు సముద్ర మట్టానికి 0.9 ఎత్తులో ద్రోణి కొనసాగుతోంది. ఇవాళ(బుధవారం) రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో అక్కడక్కడ గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు, వడగండ్లతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. బుధవారం తెలంగాణలోని ఆదిలాబాద్, కొమరం భీమ్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాలలో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో మోస్తరు వర్షాలు కురవనుండగా.. వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు వాతావరణ శాఖ అధికారులు. ఆవర్తనం, ద్రోణి ప్రభావం ఉన్నప్పటికీ తెలంగాణలోని కొన్ని జిల్లాలలో గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బుధవారం గరిష్టంగా ఆదిలాబాద్‌లో 41 కనిష్టంగా రామగుండంలో 35.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. మంగళవారం తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, భద్రాచలం, రామగుండం, హైదరాబాద్, ఖమ్మం, రామగుండం, మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదు అయింది.



# కాంగ్రెస్ తీరు మార్చుకోవాలి !

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పయనం అగమ్యగోచరంగా ఉంది. ముఖ్యంగా ఎపిలో కాంగ్రెస్ చుక్కాని లేని నావలా తయారయ్యింది. అక్కడ ఎవరు వచ్చినా ఆ పార్టీ బతికి బట్టకట్టడం కష్టం. గత ఎన్నికలకు ముందు షర్మిల పగ్గాలు చేపట్టినా పెద్దగా లాభం లేకుండా పోయింది. చివరకు ఆమె కూడా గెలవలేదు. వైఎస్ వారసత్వాన్ని అందిపుచ్చుకోవడంలో జగన్ సఫలమైనా..పాలనలో విఫలం అయ్యారు. స్వార్థపూరిత రాజకీయాలు జగన్ పతనాన్ని శాసించాయి. ఇప్పుడు షర్మిల పోరాటం వల్ల జగన్‌కు నష్టం జరగిందే తప్ప కాంగ్రెస్‌కు లబ్ది చేకూరలేదు. తెలంగాణలో బిజెపికి దక్కాల్సిన అధికారం అనూహ్యంగా కాంగ్రెస్‌కు దక్కింది. రేవంత్ రెడ్డి సిఎం అయ్యాక చేస్తున్న కార్యక్రమాలు కొంతమేరే ఫలితం ఇచ్చినా, సమర్థ నేతగా రుజువు చేసుకోలేక పోతున్నారు. బహునాయకత్వం, ప్రతిదానికీ హైకామండ్ ముందు మోకరిల్లాల్సి రావడం వంటి కారణాల వల్ల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో పలచనవుతోంది. మంత్రులతంతా ఎవరికివారు యమునా తీరే అన్నట్లుగా ఉంటున్నారు. తమ శాఖల పరిధిలోని కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయలేక పోతున్నారు. దేవాయదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖకు ఈ రెండు శాఖల్లో ఏం జరుగుతుందో తెలియడం లేదు. అడవుల పెంపకం లేదు. కోతులు గ్రామాలను పట్టిపీడిస్తున్నా పట్టించుకోవడం లేదు. దేవాలయ భూముల చెరను విడిపించలేకపోతున్నారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాటలకే పరిమితం అయ్యారు. ఎక్కడా రోడ్ల అభివృద్ధి జరగడం లేదు. రాజధాని హైదరాబాద్ అంతర్గత రోడ్లు ఏడాది దాటినా అభివృద్ధిక నోచలేదు. గ్రామాల్లో నిధులు విడుదల కాకపోవడంతో పనులు పడకేశాయి. ఇలా ఒక్కోమంత్రి తీరు ఒక్కోలా ఉంది. శాఖల్లో పనులు సక్రమంగా సాగడం లేదు. కాంగ్రెస్ అధికారంలో ఉంటే ప్రజలను పట్టించుకోదు.. ప్రతిపక్షంలో ఉంటే విపక్షంగా గట్టి పాత్ర నిర్వహించదు. అధికారం కోసం వెంపర్లాడడం తప్ప అణగిమణిగి ఉండాలన్న ఆకాంక్ష కానరాదు. పార్టీని బలోపేతం చేయడం కోసం ఎవరూ పాటుపడరు. పాటుపడేందుకు ఎవరైనా ముందుకు వస్తే కాళ్లు లాగేస్తుంటారు. అధికారం వస్తే పదవుల కోసం పాకులాడుతారు. అధికారం లేకుంటే కీచులాటతో పార్టీని భ్రష్టు పట్టిస్తుంటారు. మొత్తంగా కాంగ్రెస్‌లో ఒకరిపై ఒకరికి విశ్వాసం ఉండదు. నాయకత్వాన్ని సహించే లక్షణం లేదు. నాయకుడు ఎవరైనా కాళ్ళల్లో కట్టెలు పెట్టడం అలవాటు. అలా పార్టీకిచేటు జరుగుతున్నా పట్టించుకోరు. తాజాగా తెలంగాణ కాంగ్రెస్‌లో ఇదే ధోరణి కనిపిస్తోంది. బిఆర్ఎస్, బిజెపిలు చేస్తున్న విమర్శలను సమర్థంగా తిప్పికొట్టలేక పోతున్నారు. హైదరాబాద్ భూముల విషయంలో వీరి వాదన పేలవంగా ఉంది. నిజానికి భూమిని కోర్టులో పోరాడి దక్కించుకుంటే దానిని రక్షించాలి తప్ప అమ్మరాదు. సన్నబియ్య, పెన్షన్ల పేరుతో దుబారా చేసే బదులు దుబారాకు కళ్లెం వేయాలి.ప్రస్తుత కాంగ్రెస్ నేతలు ఎవరికి వారే అధికార కూటమిని ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇది నిజంగా ఆత్మహత్య సదృశ్యమే. ఇలా జాతీయ స్థాయిలోనూ కనిపిస్తాయి. అధికారంలో ఉంటే కళ్లు నెత్తికెక్కుతాయి. పార్టీలో ఎవరైనా పెత్తనం చెలాయిస్తారని భావిస్తే అలాంటి వారిని అసలు చేరకుండా అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తుంటారు. పార్టీపరంగా రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్దంగా ఉంటారే తప్ప పరిష్కారనికి ముందుకు రారు. జాతీయస్థాయిలో అయినా.. రాష్ట్రస్థాయిలో అయినా ఇదే పరిస్థితి ఉంటుంది. తాజాగా తెలంగాణలో జరుగుతున్న పరిస్థితులు కూడా ఇందుకు భిన్నం కాదు. రేవంత సిఎంగా ముందుకు నడుస్తున్న వేళ..పటిష్ట నిర్ణయాలపై చర్చించడం లేదు. సమస్యలను చర్చించి పరిష్కరించే చర్యలు కానరావడం లేదు. ఉమ్మడిగా పినచేయడం లేదు. కేవలం రేవంత్ మాత్రమే అందరినీ కలుపుకుని పోయేలా

ఉంటున్నారు. పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కూడా పెద్దగా పార్టీని గాడిలో పెట్టే ప్రయత్నాలు చేయడం లేదు. పార్టీ పరువు పోయినా, ఉన్న వారు బయటకు పోతున్నా.. ఉన్నవారు మాత్రం బింకాన్ని వదలకుండా తమకోసం పోరాడుతారు. తెలంగాణలోని పలువురు కాంగ్రెస్ నేతలకు కూడా ఈ జాడ్యం పట్టుకుంది. పార్టీలో వ్యతిరేకంగా పనిచేయడం పట్ల కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్‌సగా పరిగణించి..రేవంత్ రెడ్డికి పూర్తి అధికారం ఇచ్చి నడిపించడం లేదు. ఎందుకంటే రాజకీయాలు చేయడం అక్కడే మొదల వుతోంది. అధిష్టానం కర్నాటక, తెలంగాణలను పిండేస్తోందని ఆరోపణలు ఉన్నాయి. హైదరాబాద్ భూముల అమ్మకం వెనకా ఒత్తిళ్లు ఉన్నాయని అంటున్నారు. కేంద్రంలో బీజేపీ బలహీన పడితే, ఆ పరిస్థితి ఒక్క కాంగ్రెస్ పార్టీకి మాత్రమే లాభిస్తుంది. కొన్ని రాష్ట్రాలలో మాత్రమే బీజేపీ, కాంగ్రెస్ ఎదురెదురు నిలిచి ఉన్నాయి. ఈ రాష్ట్రాలలో బీజేపీ బలహీన పడితే కాంగ్రెస్ కొంత లబ్ధి పొందవచ్చు. బీజేపీ ఎంత బలహీనపడినా, కాంగ్రెస్ పూర్వ వైభవాన్ని సంతరించుకోవడం అనుమానమే. అనేక రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బీజేపీకి, కాంగ్రెస్÷–కు సవాలుగా ఉన్నాయి. తమ రాష్ట్రాలలో బీజేపీని, కాంగ్రెస్‌ను ఓడించిన ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నాయి. ఈ క్రమంలో అధికారంలో కొనసాగుతున్న తెలంగాణ కాంగ్రెస్ గత బిఆర్ఎస్ పాలనకు భిన్నంగా నడుచుకోవాలి. మాటలు, పదేపదే విమర్శలు కట్టిపెట్టి ప్రజల కోం అంతా కలసి పనిచేయాలి. హైదరాబాద్ భూముల వివాదాన్ని పక్కన పెట్టాలి. వాటిని అమ్మాలన్న ఆలోచనను పక్కకు పెట్టాలి. అందుకు ప్రత్యమ్నాయంగా ఉచిత పథకాలకు కోతలు పెట్టాలి. అప్పుడే పార్టీకి ఆదరణ పెరుగుతుంది. పార్టీని, ప్రభుత్వాన్ని ఇలాగే కొనసాగిస్తే కాంగ్రెస్ గత చరిత్ర పునరావృతం కాగలదు.

### టీమిండియా సొంతగడ్డపై

## సిరీస్‌ల వేదిక, తేదీల ప్రకటన

ఈ ఏడాదికి సంబందించి బీసీసీఐ.. టీమిండియా పురుషుల జట్టు హెూమ్ షెడ్యూల్ ను మంగళవారం ప్రకటించింది. వచ్చే జూన్ లో ఇంగ్లాండ్ పర్యటన తర్వాత వెస్టిండీస్, సౌతాఫ్రికాలతో సొంతగడ్డపై టీమిండియా మ్యాచ్ లను ఆడనుంది. తాజాగా దీనికి సంబంధించిన షెడ్యూల్ ను వెలువరించింది. అక్టోబర్ నెలలో ఇండియాలో హెూం మ్యాచ్ లు జరుగుతాయి. అహ్మదాబాద్ లో వెస్టిండీస్ తో జరిగే తొలి టెస్టుతో హెూం మ్యాచ్ లు ప్రారంభమవుతాయి. అక్టోబర్ 2-6 వరకు తొలి టెస్టు, అదేనెల 10-14 వరకు కోల్ కతాలో రెండో టెస్టు జరుగుతుంది. ఆ తర్వాత కాస్త విరామం తర్వాత ఇండియాలో సౌతాఫ్రికా టూర్ మొదలు కాబోతోంది. ఈ సిరీస్ లో రెండు టెస్టులు, మూడు వన్డేలు, ఐదు టీ20లను భారత్, సౌతాఫ్రికాలు ఆడనున్నాయి. ఇక గువాహటిలో తొలిసారి టెస్టు మ్యాచ్ ను నిర్వహించనున్నారు.

## సద్దుమణిగిన వివాదం

### హెచ్‌సీఏ, సన్‌రైజర్స్ వివాదం ఎట్టకేలకు పరిష్కారం


హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో కాంప్లిమెంటరీ టికెట్ల విషయంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ మధ్య చెలరేగిన వివాదం ఎట్టకేలకు క్లియర్ అయింది. ఇరువర్గాల ప్రతినిధుల మధ్య భేటీలో సమస్య పరిష్కారమైంది. అసలేం జరిగిందంటేహైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ హెచ్‌సీఏ వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య చెలరేగిన టికెట్ల వివాదం ఎట్టకేలకు పరిష్కారమైంది. కాంప్లిమెంటరీ టికెట్ల విషయంలో హెచ్‌సీఏ బెదిరిస్తోందని..ఇలా చేస్తే హైదరాబాద్ వదిలి వెళ్లిపోతామని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం స్పష్టం చేసింది. ఇదే అదనుగా ఎస్ఆర్‌హెచ్ జట్టును ఏపీ ప్రభుత్వం ఆహ్వానించింది. చిలికి చిలికి గాలివానలా మారిన ఈ వివాదానికి ఇప్పుడు శుభం కార్డు పడింది. ఇవాళ హెచ్‌సీఏ, ఎస్ఆర్‌హెచ్, బీసీసీఐ ప్రతినిధులు భేటీ అయ్యారు. ముగ్గురి మధ్య జరిగి త్రైపాక్షిక ఒప్పందం మేరకు నడుచుకునేందుకు అటు ఎస్ఆర్‌హెచ్ ఇటు హెచ్‌సీఏ ప్రతినిధులు అంగీకరించారు. దాంతో ఇకపై ఉప్పల్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌లకు ఎలాంటి ఆటంకం ఉండదు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ ఆర్ దేవరాజ్ నేతృత్వంలో చర్చలు జరగగా ఎస్ఆర్‌హెచ్ ప్రతినిధులు కిరణ్, శరవణన్, రోహిత్‌లు ఒప్పందాన్ని ఖరారు చేశారు. ఈ త్రైపాక్షిక ఒప్పందం ప్రకారం స్టేడియంలోని అన్ని కేటగిరీల్లో 10 శాతం టికెట్లు ఇచ్చేందుకు అంగీకారం కుదిరింది. చాలా కాలంగా ఆచరిస్తూ వస్తున్నట్టే ప్రతి కేటగరీలో పాస్ విధానం కొనసాగించాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రతిపాదించింది. ఎస్ఆర్‌హెచ్ సీఈవో షణ్ముగంతో ఫోన్ సంప్రదింపుల తరువాత 3900 కేటగరీ కాంప్లిమెంటరీ పాస్ విధానంలో ఎలాంటి మార్పులు ఉండవని తేలింది. ఎస్ఆర్‌హెచ్‌తో ప్రొఫెషనల్‌గా పూర్తిగా సహకారం అందించేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అంగీకారం తెలిపింది. గతంలో నెలకున్న వివాదాలు ఇక ముగిసినట్టేనని హెచ్‌సీఏ, ఎస్ఆర్‌హెచ్ సంయుక్తంగా ప్రకటించాయి.

## పంత్ పై గోయెంకా సీరియస్

మంగళవారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ 8 వికెట్ల తేడాతో గ్రాండ్ విక్టరీ కొట్టింది. దీంతో ప్రస్తుత సీజన్?లో పంజాబ్ వరుసగా రెండో విజయం నమోదు చేయగా, లఖ్?నవూకు మూడు మ్యాచ్?ల్లో రెండో ఓటమి. ఈ నేపథ్యంలో మ్యాచ్ అనంతరం లఖ్?నవూ కెప్టెన్ రిషభ్? పంత్ ఆ ఫ్రాంచైజీ ఓనర్ సంజీవ్ గోయెంకా మధ్య సంభాషణ వైరల్‌గా మారింది. ఈ ఇద్దరి మధ్య చర్చ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్?గా మారింది. తాజా ఓటమి తర్వాత పంత్? పట్ల సంజీవ్ అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. పంత్?ను మైదానంలో అందరిముందే జట్టు ఓటమికి గల కారణాలు అడిగినట్లుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోల్లో కనిపిస్తోంది. దీంతో లఖ్?నవూ ప్రదర్శన పట్ల సంజీవ్ సంతృప్తిగా లేరని, అందకే పంత్?ను సీరియస్ మందలించారని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. అంతేకాకుండా అతడనికి బాగా తిట్టి ఉంటాడని అభిప్రాయపడుతున్నారు.

### ప్రభ్‌సిమ్రాన్ సింగ్‌కు హగ్‌తో

## ఆకాశానికెత్తిన ప్రీతిజింటా



ఐపీఎల్ 2025 లో భాగంగా 13వ మ్యాచ్ లక్నో సూపర్ జెయింట్స్ వర్సెస్ పంజాబ్ కింగ్స్ మధ్య జరిగింది. లక్నోలోని ఎకానా స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన లక్నో టీం 172 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. దీన్ని ఛేదించే క్రమంలో పంజాబ్ ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్ తన తుఫాన్ ఇన్నింగ్స్‌తో లక్నో బౌలర్లపై విధ్వంసం సృష్టించాడు. అతను కేవలం 34 బంతుల్లో 202 స్ట్రైక్ రేట్‌తో 69 పరుగులు చేశాడు. ఈ సమయంలో ప్రభ్‌సిమ్రాన్ సింగ్ ఒక ఫోర్ కొట్టడం అందరికీ లగాన్ సినిమాను గుర్తు చేసింది. ప్రభ్‌సిమ్రాన్ సింగ్ ఇన్నింగ్స్ మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చిందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇది మాత్రమే కాదు, ఈ ఇన్నింగ్స్‌లో, ప్రభ్‌సిమ్రాన్ లక్నోలో అత్యంత వేగవంతమైన అర్ధ సెంచరీ సాధించిన రికార్డును కూడా సృష్టించాడు. ఈ క్రమంలో పంజాబ్ కింగ్స్ ఓనర్ ప్రీతిజింటా నుంచి ఓ హగ్ కూడా అందుకున్నాడు. దీంతో ఈ ఫొటో సోషల్ మీడియాలో తెగ వైరలవుతోంది. పంజాబ్ కింగ్స్ తరపున ఇన్నింగ్స్ ప్రారంభించిన ప్రభ్‌సిమ్రాన్ సింగ్ మొదటి ఓవర్లోనే 1 ఫోర్, 1 సిక్స్ కొట్టడం ద్వారా తన వైఖరి ఏంటో చూపించాడు. ఆ తరువాత ఏమాత్రం ఆగలేదు.

# బట్లర్ ఊరమాస్ ఇన్నింగ్స్

### సొంత మైదానంలో చిత్తుగా ఓడిన ఆర్‌సీబీ..




ఐపీఎల్ 14వ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తొలి ఓటమిని చవిచూసింది. గుజరాత్ టైటాన్స్ తో జరిగిన ఈ మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఎం చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు 8 వికెట్లు కోల్పోయి కేవలం 169 పరుగులు మాత్రమే చేసింది.ఐపీఎల్ 14వ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తొలి ఓటమిని చవిచూసింది. గుజరాత్ టైటాన్స్ తో జరిగిన ఈ మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఎం చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు 8 వికెట్లు కోల్పోయి కేవలం 169 పరుగులు మాత్రమే చేసింది. 170 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్ కేవలం 17.5 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి టార్గెట్ రీచ్ అయింది. గుజరాత్ టైటాన్ తరపున జోస్ బట్లర్ (60) హాఫ్ సెంచరీతో చెలరేగిపోయాడు. అలాగే ఓపెనర్ సాయి సుదర్శను (49) కూడా తన క్లాస్ ఆటతో ఆకట్టుకున్నాడు. అలాగే ఇంపాక్ట్ ప్లేయర్ షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ భారీ సిక్సర్లతో ఛేజింగ్‌ను ఈజీగా మార్చేశాడు. శుభ్మన్ గిల్ కేవలం 14 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ చేరాడు. ఆర్‌సీబీ బౌలర్లలో భువీ, జోస్ తలో వికెట్ పడగొట్టారు.ఆర్‌సీబీ తరపున లియామ్ లివింగ్‌స్టోన్ (54 పరుగులు) అర్ధ సెంచరీ సాధించాడు. జితేష్ శర్మ 33, టిమ్ డేవిడ్ 32 పరుగులు చేశారు. మహ్మద్ సిరాజ్ 3 వికెట్లు పడగొట్టాడు. సాయి కిషోర్ 2 వికెట్లు తీశాడు. అర్షద్ ఖాన్, ప్రసిద్ధ్ కృష్ణ, ఇషాంత్ శర్మ తలో వికెట్ తీశారు.

## స్టేట్ టీమ్ నుంచి మారాలనుకుంటున్న

### ముంబయి క్రికెట్ అసోసియేషన్‌కు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కోరుతూ యశస్వి లేఖ



భారత జట్టులో సంచలన ప్లేయర్ యశస్వి జైస్వాల్. ఓపెనర్‌గా దూకుడైన బ్యాటింగ్‌తో ప్రత్యర్థులపై ఆధిపత్యం ప్రదర్శిస్తుంటాడు. అయితే ఈ భారత యువ ఓపెనర్ యశస్వి జైశ్వాల్ కీలక నిర్ణయం తీసకున్నాడు. దేశవాళీ క్రికెట్ లో తన స్టేట్ టీమ్ నుంచి మారాలనుకుంటున్నట్లు వెల్లడించాడు. ఈ మేరకు ముంబయి క్రికెట్ అసోసియేషన్ కు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కోరుతూ లేఖ రాశాడు."మా నుంచి అతడు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కోరాడు. గోవాకు మారాలనుకుంటున్నట్లు తెలిపాడు. ఇది అతడి వ్యక్తిగత నిర్ణయం." అని ఎమ్‌సీఏ తెలిపింది. అలానే జైశ్వాల్ కు దగ్గరగా ఉన్న ఓ ప్రతినిధి కూడా ఈ విషయాన్ని కన్ఫామ్ చేశారు. కాగా, 2025-26 సీజన్ లో జైశ్వాల్ గోవా జట్టుకు కెప్టెన్ గా వ్యవహరిస్తాడని సమాచారం అందింది.టీమిండియా క్రికెటర్లందరూ అంతర్జాతీయ మ్యాచులు లేని సమయంలో కచ్చితంగా దేశవాళీ క్రికెట్ ఆడాలని బీసీసీఐ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో గత సీజన్ లో ముంబయి జట్టు తరఫున ఆడిన జైశ్వాల్.. రంజీ ట్రోఫీలో జుమ్ము కశ్మీర్ తో జరిగిన మ్యాచులో ఆడాడు. ఆ మ్యాచులో 4,26 పరుగులు చేశాడు. 17ఏళ్ల వయసులో ముంబయి జట్టులోకి వచ్చిడా యశస్వి. 2018-19 సీజన్ లో ముంబయి జట్టు తరపున రంజీ ట్రోఫీ అరంగేట్రం చేశాడు. 2022 సీజన్‌లో కేవలం మూడు మ్యాచుల్లోనే 83 సగటుతో 498 పరుగులు సాధించాడు. అతడి అత్యధిక వ్యక్తిగత స్కోరు 181. ఆ సీజన్ లో ముంబయి ఫైనల్‌కు చేరడంలో కీలక పాత్ర కూడా పోషించాడు. 2019-20లో విజయ్ హజారే ట్రోఫీలో డబుల్ సెంచరీ బాది అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ క్రమంలోనే టీమిండియాలోకి ఎంట్రీ ఇచ్చి మంచి ప్లేయర్ గా పేరు గాంచాడు. టెస్టుల్లోనూ సూపర్ ఓపెనర్‌గా అవతరించాడు.




ఐదుసార్లు చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ ఈ సీజన్ లో కాస్త స్ట్రగుల్ అవుతోంది. ఇప్పటివరకు ఆడిన మూడు మ్యాచ్ ల్లో కేవలం ఒక్క మ్యాచ్ లో మాత్రమే గెలిచింది. ఇక చివరి రెండు మ్యాచ్ ల్లో పరాజయం పాలైంది. ముఖ్యంగా వెటరన్లు ఎంఎస్ ధోనీ, రవీంద్ర జడేజాపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రెండు మ్యాచ్ ల్లో గెలిచే ఇంటెంట్ లేకుండా ఆడారని విమర్శిస్తున్నారు. ముఖ్యంగా రాజస్థాన్

## విమర్శలకు సమాధానమిచ్చిన జడేజా..

రాయల్స్ తో ధోనీ తొమ్మిదో స్థానంలో బ్యాటింగ్ కు రావడంపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. తాజాగా రవీంద్ర జడేజా ఈ విమర్శలకు సమాధానం అన్నట్లుగా ఒక పోస్టును షేర్ చేశాడు. తాజాగా ఈ పోస్టు నిమిషాల్లో సోషల్ మీడియాలో వైరలైంది. క్రికెట్ అభిమానులు తమకు తోచిన కామెంట్లు పెడుతూ, లైకులు, షేర్లు చేస్తూ వైరల్ చేశారు. ఇంతకీ ఆ పోస్టులో ఏముందంటే.. ప్రస్తుతమున్న గడ్డు కాలం తొలిగిపోతుందనే ఆశాభావ దృక్పథంతో పోస్టు చేశాడు. అయితే మిగతా జట్లు దూకుడే మంత్రంగా ఆడుతున్న నేపథ్యంలో చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటర్లు కూడా ఆటతీరులో మార్పు చేసుకోవాలని తెలిపాడు. అప్పుడే ఆ జట్టు విజయాల బాట పడుతుందని, మరింత బలంగా పుంజుకోగలదని పుజారా వ్యాఖ్యానించాడు. ఇక చెన్నై తన తదుపరి మ్యాచ్ ను ఈనెల 5న ఢిల్లీ క్యాపిటల్స్ తో ఆడనుంది. చివరి మ్యాచ్ లో సన్ రైజర్స్ పై ఢిల్లీ ఘన విజయం సాధించింది.

## లఖ్‌నవూపై పంజాబ్ ఘన విజయం

ఐపీఎల్ 18వ సీజన్?లో పంజాబ్ కింగ్స్‌కు వరుసగా రెండో విజయం నమోదు చేసింది. మంగళవారం లఖనవూతో జరిగినమ్యాచ్‌లో పంజాబ్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మొదటన లఖనవూ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని పంజాబ్ 16.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (69), శ్రేయస్ అయ్యర్ (52లి) అర్ధ శతకాలు బాదారు. శ్రేయస్ అయ్యర్? సిక్స్ కొట్టి మ్యాచ్‌ను ఫినిష్ చేయడం వల్ల హాఫ్ సెంచరీ అందుకున్నాడు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్?కు దిగిన లఖనవూ బ్యాటర్లలో నికోలస్ పూరన్ (44బీ 30 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) బాది టాప్ స్కోరర్?గా నిలిచాడు. ఆయుష్ బదోని (41బీ 33 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు) రాణించాడు. ఓపెనర్ మార్‌క్రమ్ (28) ఫర్వాలేదనిపించాడు. అబ్దుల్ సమద్ (27), డేవిడ్ మిల్లర్ (19) పరుగులు చేశారు. మిచెల్ మార్ష్ (0), రిషభ్ పంత్ (2) తేలిపోయారు. ఇక పంజాబ్ బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 3, ఫెర్గూసన్, మ్యాక్స్‌వెల్, మార్కో యాన్సెన్, చాహల్ తలో వికెట్ తీశారు. లఖ్?నవూ విధించిన టార్గెట్?ను పంజాబ్ కింగ్స్ సునాయాసంగా ఛేధించింది. ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(8) తేలిపోయినా- ప్రభ్‌సిమ్రన్ సింగ్ విధ్వంసకర బ్యాటింగ్ చేశాడు. లక్ష్యాన్ని మరింత చిన్నగా మార్చేశాడు. మరోవైపు శ్రేయస్ అయ్యర్ కూడా కలిసి లఖ్?నవూ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. శార్దూల్ ఠాకూర్ వేసిన మొదటి ఓవర్‌లోనే ఫోర్, సిక్స్ బాది హిట్టింగ్ మొదలు పెట్టాడు. అనంతరం ధనాధన్ బౌండరీలు బాదేశాడు. ఈ క్రమంలో 23 బంతుల్లోనే ప్రభుసిమ్రన్ సింగ్ అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు.

### రాజస్థాన్ ఖాతాలో

## ఎట్టకేలకో విజయం

రాజస్థాన్ రాయల్స్‌కు ఎట్టకేలకు ఓ శుభవార్త అందింది. ఐపీఎల్ 2025 లో కెప్టెన్, వికెట్ కీపర్ గా బాధ్యతలు స్వీకరించేందుకు బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సంజూ శాంసన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. శాంసన్ వేలికి గాయం, శస్త్రచికిత్స నుంచి కోలుకుంటున్న తర్వాత ఈ నిర్ణయం వచ్చింది. శాంసన్ ఇప్పుడు తొలిసారిగా ఐపీఎల్ 2025లో రాజస్థాన్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఈ సమయంలో, ఏప్రిల్ 5న పంజాబ్ కింగ్స్‌తో జరిగే మ్యాచ్‌లో అతను జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించేందుకు సిద్ధమయ్యాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో మొదటి మూడు మ్యాచ్‌లకు శాంసన్ బ్యాట్స్‌మన్‌గా ఆడేందుకు మాత్రమే అనుమతి ఉంది. ఈ కాలంలో, అతను వికెట్ కీపింగ్, కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. ఇటువంటి పరిస్థితిలో శాంసన్ కేవలం ఒక ఆటగాడిగా మాత్రమే మ్యాచ్ ఆడుతున్నాడు. ఇంతలో, రియాన్ పరాగ్‌ను జట్టుకు కెప్టెన్‌గా నియమించారు. కానీ, ఇప్పుడు శాంసన్ ఎన్‌సీఏ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించాడు. అతను ఇకపై రాయల్స్ తరపున వికెట్ కీపింగ్‌తో పాటు కెప్టెన్‌గా కనిపించేందుకు రెడీయ్యాడు.ఇంపాక్ట్ ప్లేయర్‌గా, శాంసన్ బ్యాట్‌తో బాగా రాణించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 66 పరుగులు, కోల్‌కతా నైట్ రైడర్స్‌పై 13 పరుగులు, చెన్నై సూపర్ కింగ్స్‌పై 20 పరుగులు చేశాడు. శాంసన్ లేనప్పుడు, ధ్రువ్ జురెల్ వికెట్ కీపింగ్ బాధ్యతలు చేపట్టాడు. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో శాంసన్ ఐపీఎల్‌లో 4500 పరుగులు పూర్తి చేశాడు.

### ముంబై ఇండియన్స్ బస్సులో

## హల్‌చల్ చేసిన జాస్మిన్ వాలియా



జాస్మిన్ వాలియా రోజ్..ఇప్పుడు క్రికెట్ వీధుల్లో ఈ పేరే చర్చనీయాంశమౌతోంది. ప్రముఖ బ్రిటీష్ రియాలిటీ షో ది ఓన్లీ వే ఈజ్ ఎస్సెక్స్ ఫేమ్ అయిన జాస్మిన్ ఇటీవల టీమ్ ఇండియా క్రికెటర్, ముంబై ఇండియన్స్ సారథి హార్దిక్ పాండ్యాతో చెట్టపట్టాలేసుకుని తిరుగుతోంది. ముంబై ఇండియన్ సారథి హార్దిక్ పాండ్యా కొత్త గర్ల్ ఫ్రెండ్ ఇప్పుడు నాయిస్ క్రియేట్ చేస్తోంది. ఐపీఎల్ మ్యాచ్‌లలో సందడి చేస్తోంది. హార్దిక్ పాండ్యా ఎక్కడ ఆడుతుంటే అక్కడికి వాలిపోతోంది. నిన్న సోమవారం జరిగిన కేకేఆర్ వర్సెస్ ముంబై ఇండియన్స్ మ్యాచ్‌లో తళుక్కుమంది. అంతేకాకుండా కేకేఆర్ జట్టుపై విజయం తరువాత ఆ టీమ్ బస్సులో ప్రత్యక్షమైంది. స్టాండ్స్ నుంచి ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యాకు సపోర్ట్ చేస్తూ చిల్ చేసింది. దుబాయ్‌లో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ 2025 లో కూడా జాస్మిన్ వాలియా ఫోటోలు, వీడియో తొలిసారిగా సోషల్ మీడియాలో వైర్ అయ్యాయి. స్ట్రైప్డ్ షర్ట్, నెర్డీ గ్లాస్‌లో హల్‌చల్ చేయడంతో ఇద్దరి మధ్య బంధంపై వస్తున్న పుకార్లకు బలం చేకూరింది. ఇద్దరూ తమ తమ సోషల్ మీడియా వేదికల్లో ఒకే రకమైన ఫోటోలు షేర్ చేయడాన్ని గమనించిన ఫ్యాన్స్ పుకార్లు ప్రారంభించారు. ఇద్దరూ గ్రీస్‌లో వెకేషన్ గడిపారనే వార్తలు కూడా వచ్చాయి. ఈ ఇద్దరూ షేర్ చేసిన ఫోటోల్లో బ్యాక్‌డ్రాప్ గ్రీస్ నేపథ్యం ఉండటం దీనికి కారణం. గత ఏడాది 2024 జూలైలో విడిపోతున్నట్టుగా హార్దిక్ పాండ్యా, నతాషా స్టాన్ కోవిక్ ప్రకటించాక హార్దిక్ వర్సెస్ జాస్మిన్ బంధంపై పుకార్లు మొదలయ్యాయి. నాలుగేళ్లు కలిసి ఉన్న తరువాత ఇద్దరూ అంగీకారంతో విడిపోవాలని నిర్ణయించుకున్నామని, కలిసి ఉండాలని చాలా ప్రయత్నించినా సాధ్యం కాలేదని ఇది కఠిన నిర్ణయమైనా తప్పడం లేదని ఇద్దరూ ప్రకటించారు. ఇప్పుడు హార్దిక్ పాండ్యాతో తిరుగుతున్నట్టుగా భావిస్తున్న కొత్త గర్ల్ ఫ్రెండ్ జాస్మిన్ వాలియా రోజ్ తమ బంధాన్ని క్లియర్ చేసేసింది. కేకేఆర్ జట్టుపై విజయం తరువాత ముంబై ఇండియన్స్ టీమ్ బస్ ఎక్కి హల్‌చల్ చేసింది. జాస్మిన్ వాలియా రోజ్ బ్రిటీష్ రియాలిటీ షో ది ఓన్లీ వే టు ఎస్సెక్స్‌తో ఫేమ్ తెచ్చుకుంది. 2017లో హిట్ అయిన బోమ్ డిగ్గీ విత్ జాక్ నైట్ పాటతో ప్రాచుర్యం పొందింది. బిగ్‌బాస్ 13 ఫైనలిస్ట్ ఆసిమ్ రియాజ్‌తో కలిసి 202లో నైట్స్ ఎన్ ఫైట్స్ మ్యూజిక్ వీడియో విడుదల చేసింది.

## అనికేత్ వర్మకు హార్దిక్ స్ఫూర్తి

2025 ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు నుంచి యంగ్ ప్లేయర్ అనికేత్ వర్మ వెలుగులోకి వచ్చాడు. ఈ 23ఏళ్ల కుర్రాడు అదిరే ఆటతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాడు. రీసెంట్?గా దిల్లీ క్యాపిటల్స్?పై అనికేత్ 41బంతుల్లోనే 74 పరుగులు చేసి ఔరా అనిపించాడు. అంతకుముందు లఖ్?నవూపై 276 స్ట్రైక్?రేట్?తో విరుచుకుపడ్డాడు. దీంతో ఒక్కసారిగా అనికేత్?కు ఫుల్ క్రేజ్ వచ్చింది. అయితే స్టార్ ప్లేయర్ హార్దిక్ పాండ్య అతడికి స్ఫూర్తిగా నిలిచాడని అనికేత్ అంకుల్ అమిత్ వర్మ వెల్లడించారు. తాను నాలుగేళ్లపాటు మ్యాగీ న్యూడిల్స్ తినే క్రికెట్ ప్రాక్టీస్‌కు వెళ్లినట్లు హార్దిక్ గతంలో పలు ఇంటర్వ్యూల్లో చెప్పాడు. ఇంటర్వ్యూల్లో హార్దిక్ మాటలు విన్న అనికేత్ కెరీర్‌ను సీరియస్‌గా తీసుకొని ప్రిపేర్ అయినట్లు అమిత్ పేర్కొన్నారు.'అనికేత్‌కు 14ఏళ్లు ఉన్నప్పుడు, ఈ న్యూస్ పేపర్‌లో ఓ వార్త చదివాను. ఓరోజు అకాడమీకి వెళ్తున్నప్పుడు అదే స్టోరీని అనికేత్‌కు చెప్పా. అప్పుడే అనికేత్‌లో ఆట పట్ల ప్యాషన్, పరుగుల దాహాన్ని నేను గమనించాను. కీలక ఆటగాడిగా మారతాడని అప్పుడే భావించా. ఒకసారి స్టేడియం చేరుకున్నాక, నా పాదాలను తాకిన అనికేత్ 'కొన్ని విషయాలు మీ దృష్టికి తీసుకొస్తున్నా' అని చెప్పాడు. అప్పుడు నేను నవ్వాను. కానీ, అతడు మాత్రం సీరియస్‌గా తీసుకున్నాడు.



- షాలినీ పాండే

## ఆలియా భట్‌తో

# పోల్చకండి ప్లీజ్

బాలీవుడ్ నటి అలియాభట్‌తో తనని పోల్చి చూడటంపై తనకు ఏమాత్రం నచ్చలేదని నటి షాలినీ పాండే అన్నారు. తనని తనలా గుర్తిస్తే చాలని ఓఇంటర్వ్యూలో చెప్పారు. ప్రేక్షకులు నన్నెంతగానో ప్రేమిస్తున్నారు. వారి ప్రేమాభిమానాలు వెలకట్టలేనివి. కొంతమంది నన్ను నటి అలియాభట్‌తో పోలుస్తూ తమ ప్రేమను తెలియజేస్తున్నారు. మనకు ఇండస్ట్రీలో ఇప్పటికే ఒక అలియా ఉన్నారు. కాబట్టి, ఆమెలా మరొకరు అవసరం లేదు. ఆమెలా ఉండాలని వేరొకరు అనుకోరు. ఎందుకంటే, ఆమె అద్భుతమైన నటి. సినిమాల్లోనే కాదు. నిజ జీవితంలోనూ ఆమె ఎంతో ఉన్నతంగా ఉంటారు. నేను కూడా ఆమె నుంచి ఎంతో స్ఫూర్తి పొందుతుంటానని అన్నారు. నాకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలనేది నా ఉద్దేశం అని షాలినీ పాండే తెలిపారు. 2017లో విడుదలైన 'అర్జున్ రెడ్డి'తో ఆమె హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. తొలి చిత్రంతోనే గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో సినిమాలు, సిరీస్‌లు చేస్తున్నారు. షాలినీ పాండే ఇటీవల నటించిన వెబ్‌సిరీస్ 'డబ్బా కార్టెల్'. షబానా అజ్మీ, జ్యోతిక కీలక పాత్రల్లో నటించారు. నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.



## చిరంజీవితో వినూత్నంగా వీడియో

చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం మెగా 157-వర్కింగ్ -టైటిల్ ఉగాది నాడు పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన విషయం తెలిసిందే. చిరంజీవి కెరీర్‌లోని ఐకానిక్ పాత్రలనూ, చిత్రబృందాన్ని పరిచయం చేస్తూ వినూత్నమైన వీడియోను మంగళవారం అనిల్ రావిపూడి విడుదల చేశారు. వీడియో ప్రారంభంలో దర్శకత్వ విభాగం సభ్యులు చిరంజీవి పంచబోయే వినోదాన్ని చూసేందుకు ఆసక్తిగా ఉన్నామని చెప్పారు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో మాస్టర్ పాటపాడుతూ ఎంట్రీ- ఇవ్వగా, చిరంజీవి 'గోదారి గట్టు-' పాట నుంచి కొన్ని లైన్లు ఆలపించి ఎంటర్‌టైన్ చేశారు. ఇలా సాంకేతిక వర్గాన్ని పరిచయం చేస్తూ సగిన వీడియ మెగా అభిమానుల్లో జోష్ నింపింది.

## రెండో సినిమా ప్రకటించిన

# నిహారిక

### - సంగీత్ శోభన్‌తో తదుపరి చిత్రానికి రెడీ

మెగా బ్రదర్ నాగబాబు ముద్దుల తనయ నిహారిక యాంకర్‌గా, హీరోయిన్‌గా,నిర్మాతగా టాలీవుడ్ ఇండస్ట్రీలో సత్తా చాటుతుంది. హీరోయిన్‌గా నిహారిక చేసిన సినిమా ఒక్కటి హిట్ కాలేదు. దాంతో నిర్మాత అవతారం ఎత్తింది. నిహారిక నిర్మించిన కమిటీ కుర్రోళ్ల సినిమా సంచలన విజయం సాధించింది. ముందుగా హీరోయిన్ గా, తర్వాత వెబ్ సిరీస్ ల్లో నటించిందికానీ చివరకు నిర్మాతగా స్థిరపడింది. నిహారిక ఇటీవలే చిరంజీవి విశ్వంభర చిత్రంలోని ఓ పాటలో షూటింగ్ లో పాల్గొంది. ఈ పాటలో సాయిధరమ్ తేజ్ కూడా పాల్గొన్నారు. నటిగా మంచి మార్కులు దక్కించుకోలేకపోయిన నిహారిక నిర్మాతగా సత్తా చాటుతుంది. కొత్త డైరెక్టర్, కొత్త నటీనటులతో చిన్న సినిమాగా వచ్చిన కమిటీ- కుర్రోళ్లు చిత్రం 50 కోట్ల వసూళ్లు సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది.. ఇప్పుడు నిహారిక నిర్మాతగా రెండో సినిమాతో పలకరించబోతుంది. తన రెండు సినిమాని అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాలో ఫుల్ ఫామ్ లో ఉన్న నటుడు సంగీత్ శోభన్ హీరోగా నటించబోతున్నాడు. మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ సినిమాలతో పాటు- ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ, 3 రోజెస్.. పలు సిరీస్ లతో ఫుల్ ఫేమ్ తెచ్చుకున్న సంగీత్ ఇందులో మెయిన్ లీడ్ పోషించబోతున్నాడు. సంగీత్ సోలో హీరోగా నటించనున్న తొలి సినిమా ఇదే. ఈ సినిమాకు మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. అయితే ఈ ఇద్దరు గతంలో నిహారికతో కలిసి పని చేశారు. నిహారిక రూపొందించిన వెబ్ ప్రాజెక్ట్సలో హీరో సంగీత్ శోభన్, డైరెక్టర్ మానస శర్మ భాగం అయ్యారు. జీ5తో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ రూపొందించిన వెబ్ సిరీస్ 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'కి మానస శర్మ రచయితగా పని చేశారు. 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'లో సంగత్ శోభన్ ప్రధాన పాత్ర పోషించారు. ఇక సోనీ లివ్ రూపొందించిన 'బెంచ్ లైఫ్'కి మానస శర్మ దర్శకురాలిగా పని చేశారు. గతంలో ఈ ముగ్గురు కలిసి అద్భుతాలు చేయగా, ఇప్పుడు ఫీచర్ ఫిల్మ్ సరికొత్త హిస్టరీ క్రియేట్ చేసేందుకు రెడీ అయ్యారు. ఈ ప్రాజెక్ట్‌కి మానస శర్మ కథను అందించగా మహేష్ ఉప్పల కో రైటర్‌గా స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించారు. మన్యం రమేష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు



- నిహారిక

## చిరంజీవితో నాని సినిమా

### - అంచనాలను పెంచిన ప్రకటన

నేచురల్ స్టార్ నాని ఇప్పుడు హీరోగా కన్నా నిర్మాతగానే అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. కారణం ఆయన చేసే ప్రతి సినిమా కూడా సూపర్ హిట్ అవుతుంది. రీసెంట్‌గా కోర్ట్ అనే సినిమాతో పెద్ద విజయం సాధించారు. ఈ క్రమంలో నాని అంటే మంచి సినిమాలు చేస్తాడని ఫ్యాన్స్ తో పాటు ప్రేక్షకులు, కూడా ఫిక్స్ అయ్యారు. ప్రస్తుతం నాని శైలేష్ కొలను దర్శకత్వంలో సొంత బ్యానర్ లో హిట్3 సినిమా చేస్తున్నాడు. అలానే ది ప్యారడైజ్ అనే చిత్రంలోను నటిస్తున్నాడు. అయితే రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నాని తన ఫ్యూచర్ ప్రాజెక్టుల గురించి కొన్ని ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. త్వరలో దసరా డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెలతో చిరంజీవి ఓ ప్రాజెక్ట్ చేయనుండగా, దీనికి నాని సహ నిర్మాతగా వ్యవహరించనున్నారు. ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు బాగా ఉన్నాయి. అందుకు కారణం ఈసారి మళ్లీ రక్తం పారాల్సిందే అంటూ శ్రీకాంత్ చాలా వయెలెంట్ సినిమా చేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. దీని గురించి తాజా ఇంటర్వ్యూలో నాని మాట్లాడుతూ.. చిరంజీవి గారు అనగానే డ్యాన్స్, యాక్షన్ అని మనం ఒక అభిప్రాయానికి వచ్చేశాం..కానీ ఆయన అంతకుమించి.. చిరంజీవి కేవలం అది మాత్రమే కాదు.. ఆయన్ని ప్రతి ఫ్యామిలీలో ఒక మెంబర్‌గా భావిస్తాం.. కానీ ఆ విషయాన్ని మనం మర్చిపోయి వేరే దేనిపైన ఫోకస్ చేస్తున్నాం. ఇప్పుడు శ్రీకాంత్ మ్యాడ్‌నెస్‌ని చిరంజీవి గారి సినిమా అంటే అది చాలా సూపర్ కాంబో.. అసలు నా లైఫ్‌లో చిరంజీవి గారి లాంటి స్థాయి వ్యక్తిని పెట్టి నేను ఓ సినిమా తీస్తానని ఎప్పుడూ ఊహించలేదు.. కానీ అనుకోకుండా ఇది కుదిరింది.. ఇది గొప్ప బాధ్యతగా భావిస్తున్నా.. ఖచ్చితంగా ది బెస్ట్ ఇస్తాం అంటూ నాని కామెంట్స్ చేశారు. ప్రస్తుతం నాని చేసిన కామెంట్స్‌తో మూవీపై అంచనాలు అమాంతం పెరిగాయి. నాని, చిరంజీవికి ఈ ప్రాజెక్ట్ మెమోరబుల్‌గా ఉండడం ఖాయమని అంటున్నారు.. ఈ వచ్చే ఏడాది ఈ సినిమా షూటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు.



## అద్భుత చిత్రరాజం..ఆదిత్య 369

అప్పట్లో ఆదిత్య-369 అద్భుత విజయం సాధించింది. అంతేకాదు మంచి సినిమాగా నిలిచింది. దర్శకుడు సింగీతం ఖాతాలో హిట్ పడింది. ఆయన ప్రతిభన్ మరోమరాఉ చాటింది. ఈ సినిమా గురించి ... ఇదేం నేపథ్యంఅని అప్పట్లో చాలామంది సందేహించారు. సినిమా విడుదలై, ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లడం చూసి ఆశ్చర్యపోయారు. దాదాపు 34 ఏళ్ల క్రితం తెరకెక్కిన ఈ సినిమా అధునాతన సాంకేతిక విలువలతో ఈ నెల 4న రీ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు నాటి విశేషాలు పంచుకున్నారు. హాలీవుడ్ మూవీ 'బ్యాక్ టు- ది ఫ్యూచర్' స్ఫూర్తితో 'ఆదిత్య 369' తీశానని అనడాన్ని తిప్పికొట్టారు. ది టైమ్ మిషన్' నవలను తాను కాలేజీ రోజుల్లోనే చదివానని, అందులోని ఆసక్తికర అంశాల గురించి స్నేహితులతో చర్చించేవాడిని. డైరెక్టర్‌ని అయిన తర్వాత ఆ కాన్సెప్టుతో సినిమా చేస్తే బాగుంటుందనిపించింది. ఓ సారి విమాన ప్రయాణం చేస్తుండగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో నా ఆలోచన చెప్పా. ఎంతో ఉత్సాహం చూపిన ఆయన 'ఐడియా బాగుంది. తప్పకుండా చేద్దాం' అని అన్నారు. ఇద్దరు ముగ్గురు ప్రముఖ నిర్మాతలకు ఆయనే ఈ కథ వినిపించారు. కానీ, వారికి సైన్స్ ఫిక్షన్ కాన్సెప్ట అర్థం కాలేదు. ఇదేదో ఫాంటసీ సినిమా అనుకున్నారు. కథపై నమ్మకం ఉన్న ఎస్పీబీ పట్టు వదలకుండా.. నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్‌ను సంప్రదించారు. ఆయనకు బాగా నచ్చడంతో సినిమా పట్టాలెక్కింది. హీరో పాత్రకు ముందు నుంచీ బాలకృష్ణనే అనుకున్నాం. స్టోరీ విన్న వెంటనే ఆయన నటించేందుకు అంగీకరించారు. హీరోయిన్‌గా విజయశాంతి బాగుంటుందని కృష్ణప్రసాద్, బాలకృష్ణ అనుకున్నారు. డేట్స్ సర్దుబాటుకాకపోవడంతో ఆమె నటించలేకపోయారు. ఓ దర్శకుడు మోహిని గురించి చెప్పగా.. ఆడిషన్ చేసి కథానాయికగా ఆమెను ఎంపిక చేశాం. బాలీవుడ్ నటుడు టీనూఆనంద్‌ను ప్రొఫెసర్ పాత్రకు తీసుకున్నామని అన్నారు. టైటిల్ విషయంలో కృష్ణప్రసాద్ ఏమైనా అనుకుని ఉండొచ్చుగానీ నేను ముందు నుంచీ 'ఆదిత్య' పేరునే ఫిక్స్ అయ్యా. అలా 'ఆదిత్య 369' అయిందని సింగీతం వివరించారు.



Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463